



# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక







హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 250, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, ఆదివారం - 20 - అక్టోబర్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


### బెంగళూరు టెస్టులో పంత్ రికార్డుల మోత...
## ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్‌ల రికార్డులు బద్దలు



2

టెస్టుల్లో అత్యంత వేగంగా 2,500 పరుగులు అందుకున్న భారత వికెట్ కీపర్‌గా అవతరణ

ఈ జాబితాలో ధోనీ రికార్డును బద్దలుకొట్టిన రిషబ్ పంత్

టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో కపిల్ దేవ్‌ను దాటేసిన స్టార్ బ్యాటర్

### 24 గంటల్లో ఐదు విమానాలకు బాంబు బెదిరింపులు..
## ఒకటి ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లింపు




2

- గత వారం రోజుల్లో 20 విమానాలకు బాంబు బెదిరింపులు
- అన్నీ ఉత్తవేనని తేల్చిన అధికారులు
- ఇలాంటి బెదిరింపులకు దిగేవారిపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్న విమానయానశాఖ

## ఏపీలో దారుణం..
## బాలికను మాట్లాడుదామని పిలిచి..




2

ఈ దారుణం కడప జిల్లా బద్వేల్‌లో చోటు చేసుకుంది

నన్ను ప్రేమించు, లేదంటే చనిపోతా అని విద్యార్థినిని బెదిరించారు విగ్నేష్ అనే 20 ఏళ్ల యువకుడు

చెప్పిన దానికి యువతి అంగీకరించకపోవడంతో ఆమెకు నిప్పంటించినట్లు తెలుస్తోంది

### అమరావతి పనుల పునఃప్రారంభం..
## విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామన్న సీఎం చంద్రబాబు



2

- సీఆర్‌డీఏ కార్యాలయం పనుల ద్వారా రాజధాని నిర్మాణం పునఃప్రారంభం
- భవన ప్రాంగణంలో మంత్రి నారాయణతో కలిసి చంద్రబాబు పూజా కార్యక్రమం
- 2017లో రూ.160 కోట్లతో సీఆర్డీఏ ఆఫీస్ నిర్మాణాన్ని ప్రారంభించిన ప్రభుత్వం
- ఈ నెల 16న జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పనుల ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం

## మూడు నెలలు మూసీ పక్కనే ఉంటా: రేవంత్ రెడ్డి సవాల్‌కు సిద్ధమేనన్న కేటీఆర్



2లో

మూసీ పక్కనే ఉండాలని రేవంత్ రెడ్డి సవాల్ చేశారన్న కేటీఆర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది బ్యూటిఫికేషన్ కాదు... లూటిఫికేషన్ అని వ్యాఖ్య

నాగోల్‌లో మురుగు శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కేటీఆర్

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కేటీఆర్, హరీశ్ రావు మిగతా..2లో

## మూసీ ప్రాజెక్టు ఖర్చెంత..?
## బీఆర్ఎస్, కాంగ్రెస్ చెప్తున్న లెక్కల్లో వాస్తవమెంత..?



అయితే..
ఏకంగా లక్షా 50వేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలు సందర్భాల్లో ఆరోపించారు. అందులో 50వేల కోట్లు ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టి.. లక్ష కోట్లను ఢిల్లీకి తరలించేందుకు సిద్ధమయ్యారని ఆయన ప్రధాన ఆరోపణ. కేవలం దోచుకో.. దాచుకో అన్నట్లుగానే కాంగ్రెస్ పాలన నడుస్తోందని అంటున్నారు.



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయాలు మూసీ ప్రాజెక్టు చుట్టూరే నడుస్తున్నాయి. మిగతా..2లో

- కేవలం అప్పనంగా దోచుకునేందుకే ఈ ప్రాజెక్టును ముందరేసుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు
- ముఖ్యంగా మూసీ పరిధిలోని నిర్వాసితులను ఖాళీ చేయించేందుకు వ్యతిరేకిస్తోంది
- లక్షా 50వేల కోట్లతో నిర్మించడానికి ఇదేమైనా కాళేశ్వరం ప్రాజెక్టా అని ప్రశ్నించారు
- ముఖ్యమంత్రి మాత్రం ఇప్పటివరకు 141 కోట్లు కేటాయించామని అంటున్నారు
- భవిష్యత్తులో నిర్మాణాలన్నింటికీ ఎన్ని వేల కోట్లు ఖర్చు చేస్తారనేది ఎక్కడా చెప్పలేదు

## గ్రూప్ 1 అభ్యర్థుల ర్యాలీలో తోపులాట.. బండి సంజయ్, ఆ ప్రవీణ్ అరెస్ట్



2

హైదరాబాద్, : హైదరాబాద్‌లోని లోయర్‌ట్యాంక్ బండ్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రూప్ 1 అభ్యర్థులు చేపట్టిన ర్యాలీలో గందరగోళం చోటు చేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కలిసి సచివాలయానికి గ్రూప్ 1 అభ్యర్థులు ర్యాలీగా వెళు_ఒడగా.. ర్యాలీలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ నేతలు కూడా వచ్చారు. శ్రీనివాస్‌గౌడ్, %=% ప్రవీణ్, దాసోజుకు నిరసన సెగ వెల్లువెత్తింది. గ్రూప్ 1 అభ్యర్థుల ర్యాలీలోకి బీఆర్ఎస్ నేతలు రావడంతో బీజేపీ నేతలు వారిని అడ్డుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య తోపులాట జరిగింది. బీఆర్ఎస్ నేతలను ఏబీవీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. మిగతా..2లో

## ఓడిపోయాక బీఆర్ఎస్ వాళ్లు వేరే దేశానికి



2లో

### వెళ్లి బ్రతుకుతారని భావించా: మంత్రి కోమటిరెడ్డి

- బీఆర్ఎస్ వాళ్లు ఇంకా సిగ్గులేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారని ఎద్దేవా
- బీఆర్ఎస్ హయాంలో పథకాల పేర్లతో రూ.7 లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శ

## అప్పుడు దోచుకుని.. ఇప్పుడు విమర్శలా: జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



జగన్, వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం

గత ఐదేళ్లలో ఎక్సైజ్ శాఖ ను నిర్వీర్యం చేసింది తమరు కాదా అని ప్రశ్నించారు

పక్క రాష్ట్రాల్లో పోలిస్తే ఏపీలో ఎందుకు అంత ఆదాయం తేడా వచ్చిందన్నారు

అమరావతి : : రాష్ట్రంలో అమలవుతున్న మద్యం విధానంపై వైఎస్ జగన్, వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై మంత్రి కొల్లు రవీంద్ర మిగతా..2లో

- ఇటీవల చంద్రబాబు సైతం జమిలీ ఎన్నికలకు మద్దతు ప్రకటించారు
- జమ్మూకశ్మీర్ లో పెరిగిన బలం నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీయే సర్కార్
- వచ్చే ఎన్నికల్లోనూ కలిసే వెళ్లాలంటూ చంద్రబాబు ప్రతిపాదించారు
- జమిలీ ఎన్నికల దిశగా అడుగులు వేస్తోంది!
- చంద్రబాబు రానున్న ఎన్నికలకోసం నేతలను సమాయత్తం చేసే పనులకు పూనుకున్నారని అంటున్నారు

### జమిలీ చర్చల వేళ బాబు బిగ్ ఆఫర్...
## మోడీ, పవన్ సిద్ధమేనా?



అమరావతి : ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో బీజేపీ, జనసేనతో కలిసిన టీడీపీ కూటమి సూపర్ విక్టరీ మిగతా..2లో

## తెలంగాణ కేబినెట్ సమావేశం
# 26వ తేదీకి వాయిదా

### ఈ నెల 23న జరగాల్సిన కేబినెట్ సమావేశం
### రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం



హైదరాబాద్: ఈ నెల 23న జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం 26వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ఈ నెల 26న సాయంత్రం నాలుగు గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని వెల్లడించారు. కేబినెట్ సమావేశం వాయిదా పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ కేబినెట్ సమావేశంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు, హైడ్రా ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించడం, రెవెన్యూ చట్టం, మూసీ బాధితుల అంశం, వరద నష్టం, రైతుభరోసా తదితర అంశాలపై చర్చించే అవకాశముంది. ఈ మేరకు వివరాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేస్తుందోచ్




2లో

- నవంబరు 3వ తేదీన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది
- ప్రస్తుతం జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీతో ముగుస్తాయి
- ప్రస్తుతం జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీతో ముగుస్తాయి

## బెంగళూరు టెస్టులో పంత్ రికార్డుల మోత...

# ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్‌ల రికార్డులు బద్దలు

న్యూఢిల్లీ : టెస్ట్ క్రికెట్‌లో పునరాగమనం తర్వాత భారత స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇటీవలే బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌లో సెంచరీ బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ప్రస్తుతం న్యూజిలాండ్‌తో బెంగళూరు వేదికగా జరుగుతున్న తొలి టెస్టులోనూ కదం తొక్కాడు. తొలి ఇన్నింగ్స్‌లో జట్టు కేవలం 46 పరుగులకే ఆలౌట్ అయ్యి... రెండో ఇన్నింగ్స్ లో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో అత్యంత బాధ్యతాయుతంగా ఆడాడు. భారత రెండో ఇన్నింగ్స్ 83 ఓవర్లు ముగిసే సరికి అతడు 88 పరుగులతో క్రీజులో ఉన్నాడు. సెంచరీ దిశగా దూసుకెళుతున్నాడు. ఈ క్రమంలో పంత్ ఇవాళ (శనివారం) రెండు కీలకమైన రికార్డులు నెలకొల్పాడు.

ధోనీ రికార్డు బద్దలు..

టెస్టుల్లో అత్యంత వేగంగా 2,500 పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ చరిత్ర సృష్టించాడు. పంత్ కేవలం 62 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని సాధించాడు. పంత్ కంటే ముందు వికెట్ కీపింగ్ దిగ్గజం ఎంఎస్ ధోనీ 69 మ్యాచ్‌ల్లో 2,500 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ఆ రికార్డును పంత్ చెరిపివేశాడు.

కపిల్ దేవ్‌ను దాటేసిన పంత్

బెంగళూరు టెస్టులో సెంచరీ దిశగా దూసుకెళ్తున్న రిషబ్ పంత్ దిగ్గజ ఆల్ రౌండర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలుకొట్టాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత ఆటగాళ్ల జాబితాలో కపిల్‌ను వెనక్కినెట్టాడు. బెంగళూరు టెస్టులో నాలుగు సిక్సర్లు బాదడంతో ఆరవ స్థానానికి చేరాడు. కపిల్ దేవ్ 7వ స్థానానికి పడిపోయాడు.

టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత ఆటగాళ్లు వీళ్లే...

1. వీరేంద్ర సెహ్వాగ్ - 90 సిక్సర్లు (178 మ్యాచ్‌లు),2. రోహిత్ శర్మ - 88 సిక్సర్లు (107 మ్యాచ్‌లు),3. ఎంఎస్ ధోనీ - 78 సిక్సర్లు (144 మ్యాచ్‌లు),4. సచిన్ టెండూల్కర్ - 69 సిక్సర్లు (329 మ్యాచ్‌లు),5. రవీంద్ర జడేజా - 66 సిక్సర్లు (108 మ్యాచ్‌లు),6. రిషబ్ పంత్ - 63 సిక్సర్లు ( 62 మ్యాచ్‌లు),7. కపిల్ దేవ్ - 61 సిక్సర్లు (184 మ్యాచ్‌లు).

## 24 గంటల్లో ఐదు విమానాలకు బాంబు బెదిరింపులు..

# ఒకటి ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లింపు

న్యూఢిల్లీ : విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో ఏకంగా ఐదు విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో విమానాలను మళ్లించడం, అత్యవసర ల్యాండింగ్ చేయించడం జరిగింది. బాంబు బెదిరింపులు అందుకున్న ఐదు విమానాల్లో మూడు విస్తారా ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ ఉన్నాయి. ఈ ఉదయం వీటికి బెదిరింపులు వచ్చాయి. అయితే, ఇవన్నీ ఉత్తిత్తి బెదిరింపులేనని తేలింది. బాంబు బెదిరింపు అందుకున్న ఢిల్లీ-లండన్ విమానాన్ని ఫ్రాంక్‌ఫర్ట్ మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ తనిఖీల అనంతరం బాంబు బెదిరింపు ఉత్తదేనని తేలడంతో విమానం తిరిగి బయలుదేరింది. అలాగే, దుబాయ్ నుంచి 189 మంది ప్రయాణికులతో జైపూర్ వెళ్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి కూడా ఈమెయిల్ ద్వారా ఇలాంటి బెదిరింపే వచ్చింది. నిన్న బెంగళూరు నుంచి ముంబై వెళ్లాల్సిన ఆకాశ్ ఎయిర్ విమానానికి టేకాఫ్‌కు ముందు ఇలాంటి బెదిరింపే వచ్చింది. కాగా, గత వారం రోజుల్లో ఏకంగా 20 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. గురువారం ఒక్క రోజే ఐదు బెదిరింపులు వచ్చాయి. అయితే, అన్నీ ఉత్తవేనని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 'బాంబ్స్', 'బ్లడ్ విల్ స్ప్రెడ్ ఎవరీవేర్', 'ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్', 'దిస్ ఈజ్ నాటే జోక్', 'యు విల్ డై', 'బాంబ్ రఖ్వా దియా హై' అని చెబుతూ నిందితులు బెదిరింపులకు దిగుతున్నారు. ఇలాంటి కేసులోనే ముంబైకి చెందిన 17 ఏళ్ల కుర్రాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలాంటి కాల్స్ చేసే వారిపై కఠిన చర్యలకు పౌర విమానయానశాఖ సిద్ధమవుతోంది.

# ఏపీలో దారుణం..

# బాలికను మాట్లాడుదామని పిలిచి..

అమరావతి : ప్రేమ పేరుతో మరో మృగాడు రెచ్చిపోయాడు. ప్రేమిస్తావా.. చంపేయమంటావా అంటూ యువతికి అల్టిమేటం జారీ చేశాడు. ఆ విద్యార్థి నుంచి ఎలాంటి రిప్లై రాకపోవడంతో ఏకంగా చున్నికి నిప్పంటించి యువతిపై వేసినట్లు తెలుస్తోంది. ఈ దారుణం కడప జిల్లా బద్వేల్‌లో చోటు చేసుకుంది. నన్ను ప్రేమించు, లేదంటే చనిపోతా అని విద్యార్దినిని బెదిరించారు విగ్నేష్ అనే 20 ఏళ్ల యువకుడు.. ఈ క్రమంలో ఆ బాలికను సెంచరీ ఫ్లై ఉడ్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించాడు. అతను చెప్పిన దానికి యువతి అంగీకరించకపోవడంతో ఆమెకు నిప్పంటించినట్లు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నం వేళ.. హైవే 67పై కొనఊపిరితో యువతి కొట్టుమిట్టాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్న పోలీసులు చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బద్వేల్ రామాంజనేయ నగర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. అయితే.. ఈ ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణంగా పేర్కొంటున్నారు. ముందు యువతిని మాట్లాడాలని పిలిచి.. ఆ తర్వాత చున్నీకి నిప్పంటించినట్లు సమాచారం.. తనను ప్రేమించకపోతే.. చంపుతానంటూ బెదిరించినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బాధితురాలికి బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తును ప్రారంభించారు..

## ఓడిపోయాక బీఆర్ఎస్ వాళ్లు వేరే దేశానికి


## వెళ్లి బ్రతుకుతారని భావించా: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ వాళ్లు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారని భావించానని... కానీ సిగ్గు లేకుండా ఇంకా రోడ్ల మీద తిరుగుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రవ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ఇలా వివిధ పథకాల పేర్లతో రూ.7 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చామని కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని, కానీ మేం చేసేదే చెప్పామన్నారు. "అరె పిచ్చి కేటీఆర్... మీలాగా అమలు చేయలేని హామీలు మేం ఇవ్వలేదు. ఎంత కష్టమైనా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం" అన్నారు. "కేటీఆర్, హరీశ్ రావుకు ఏం పుట్టింది... మీకు రాజకీయాలు చేయడం తెలుసా?" అని కోమటిరెడ్డి ప్రశ్నించారు. నల్గొండలో అనారోగ్యం బారినపడిన వారు చాలామంది ఉన్నారని, ఎన్నో వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఫ్లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు. మురుగు శుద్ధి కేంద్రాలతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదన్నారు. నగరానికి స్వచ్ఛమైన నీరు అందించాలని వ్యాఖ్యానించారు. ఫ్లోరైడ్‌కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్‌బీసీయే అన్నారు. ఎస్ఎల్‌బీసీ, మూసీ జల శుద్ధీకరణ అంశాల్లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన అభినందించారు. కేసీఆర్ కొడుకు అంటే అందరూ గుర్తు పడతారని, కానీ కేటీఆర్ అంటే ఆయనను ఎవరూ గుర్తు పట్టరని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయినప్పటికీ కేటీఆర్‌కు అహం తగ్గలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని దేశాలు తిరిగి పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించారన్నారు. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు కేటీఆర్ రెచ్చగొడితే రెచ్చిపోరని, తమకు స్వతహాగా పౌరుషం ఉందన్నారు.

## అప్పుడు దోచుకుని.. ఇప్పుడు విమర్శలా


## : జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

మొదటి పేజి తరువాయి



ఆగ్రహం వ్యక్తం చేశారు.గన్ హయాంలో మద్యం, ఇసుక పై వచ్చిన ఆదాయాన్ని దోచుకుని ఇప్పుడు సక్రమంగా అమలువుతున్న విధానాలపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని ఆయన కౌంటర్ ఇచ్చారు. గత ఐదేళ్లలో ఎక్సైజ్ శాఖ ను నిర్వీర్యం చేసింది తమరు కాదా అని ప్రశ్నించారు. సెబ్ పేరుతో అక్రమ మద్యం వ్యాపారం చేయలేదా అని నిలదీశారు. మద్యం తయారీ నుంచి రిటైల్ అమ్మకాల వరకూ అన్ని వ్యవస్థలను తమరు గుప్పిట్లో పెట్టుకోలేదా అని వ్యాఖ్యానించారు. జగన్ అమ్మిన కల్తీ మద్యం తాగి రాష్ట్రంలో 50 లక్షల మంది కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో వేలాది ఎమ్మార్పీ ఉల్లంఘనలు జరిగాయని, వాటిపై ఏం సమాధానం చెబుతారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. 2019-24 మధ్య భారీగా మద్యం రవాణా కేసులు నమోదు కాలేదా అని నిలదీశారు. పక్క రాష్ట్రాల్లో పోలిస్తే ఏపీలో ఎందుకు అంత ఆదాయం తేడా వచ్చిందన్నారు. ఇందుకు తమరు సమాధానం చెబుతారా అని వ్యాఖ్యానించారు. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న, దేశ వ్యాప్తంగా ఉన్న మద్యం బ్రాండ్లను ఏపీలో అందుబాటులో ఉంచామని కొల్లు రవీంద్ర తెలిపారు. రూ.99కే క్వార్టర్ మద్యాన్ని త్వరలోనే అందిస్తామని, అందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తోందని స్పష్టం చేశారు. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి మద్యం ధరలను నిర్ణయిస్తామని తెలిపారు. నీతులు చెప్పడం మాని... గత ఐదేళ్లలో జరిగిన మద్యం అక్రమాలపై చర్చకు సిద్ధం కావాలని జగన్‌కు కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు.

# జమిలీ చర్చల వేళ బాబు బిగ్ ఆఫర్... మోడీ, పవన్ సిద్ధమేనా?



మొదటి పేజి తరువాయి

సాధించిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సీట్లు దక్కించుకుంది. అయితే... ఈ సమయంలో జమిలీ ఎన్నికల దిశగా కేంద్రం అడుగులు వేస్తోందనే చర్చ తెరపైకి వచ్చింది. ఈ సమయంలో చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు! / అవును... హర్యానా ఎన్నికల్లో ఘన విజయం.. జమ్మూకశ్మీర్ లో పెరిగిన బలం నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీయే సర్కార్.. జమిలీ ఎన్నికల దిశగా అడుగులు వేస్తోంది! ఇటీవల చంద్రబాబు సైతం జమిలీ ఎన్నికలకు మద్దతు ప్రకటించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే.. అభివృద్ధికి ఆటంకం ఉండదని అన్నారు. దీంతో.. త్వరలో జమిలీ ఎన్నికలు అనే చర్చ బలపడింది. ఈ నేపథ్యంలో.. తాజాగా జరిగిన ఎన్డీయే సమావేశం తర్వాత పార్టీ నేతలతో సమావేశమైన చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా.. వచ్చే ఎన్నికల కోసం నేతలంతా సమాయత్తమవ్వాలని సూచించారు! ఇదే సమయంలో... కూటమిలోని మూడు పార్టీల పొత్తులపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఇవి హాట్ టాపిక్ గా మారాయి. అవును... సార్వత్రిక ఎన్నికలు జరిగి నాలున్నర నెలలు మాత్రమే అయిన నేపథ్యంలో.. జమిలీ ఎన్నికల చర్చ వేళ.. చంద్రబాబు రానున్న ఎన్నికలకోసం నేతలను సమాయత్తం చేసే పనులకు పూనుకున్నారని అంటున్నారు. ఈ సమయంలో... కూటమి ఐక్యత గురించి ప్రస్థావించిన ఆయన.. మూడు పార్టీల కేడర్ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కూటమిలో మూడు పార్టీల పొత్తు కొనసాగాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లోనూ కలిసే వెళ్లాలంటూ చంద్రబాబు ప్రతిపాదించారు. ఇదే సమయంలో... మిత్రపక్షాలను కలుపుకొని వెళ్లాలంటూ పార్టీ నేతలకు సూచించారు. కూటమిగా ఉంటేనే బలం ఉంటుందని తేల్చి చెప్పారు! ఆ సంగతి అలా ఉంటే... కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్.. బాబు కేబినెట్ లో పలుశాఖలకు మంత్రిగానూ ఉన్నారు. ఇదే క్రమంలో... పరిపాలనా వ్యవహారాల్లో చంద్రబాబే తనకు స్ఫూర్తి, ఆదర్శం అని చెబుతున్నారు. దీంతో... రానున్న ఎన్నికల్లోనూ ఏపీలో కూటమిగానే పోటీ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా... రానున్న ఎన్నికల్లోనూ కలిసే ముందుకు వెళ్లాలంటూ చంద్రబాబు ఇచ్చింది ఏపీలో జనసేన, బీజేపీలకు బిగ్ ఆఫరే అని అంటున్నారు పరిశీలకులు! బాబు ఇచ్చిన ఆఫర్ ను బ్లైండ్ గా ఫాలో అయిపోతే చాలని కార్యకర్తలు చెబుతున్నారని అంటున్నారు!

# లౌక్యం తెలియని రాజకీయం.. జగన్ ఒక క్వశ్చన్ మార్క్..!



అమరావతి : రాజకీయాలన్నాక.. స్టయిల్ మార్చాలి. పాలిటిక్స్ అన్నాక.. పట్టు విడుపులు కూడా ఉండాలి. మరీ ము ఖ్యంగా ప్రజలను మెప్పించేందుకు.. ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు లౌక్యం చాలా అవసరం. ముఖ్యం కూడా. - ఏం చెప్పారన్నది కాదు.

ఎలాంటి హామీలు ఇచ్చారన్నది కాదు.. అధికారంలోకి వచ్చా రా? లేదా? అన్నదే ముఖ్యం - - ఇదీ నేటి రాజకీయం. కేంద్రం నుంచి రాష్ట్రాల వరకు.. అన్నిప్రభుత్వాల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఈ లౌక్యానికి ఎవరూ అతీతులు కారు. రాజకీ యాల్లో అన్నీచెప్పినట్టు జరగవు! ఇది కామన్ ఫ్యాక్టర్. కానీ, వైసీపీ అధినేత, మాజీసీఎం జగన్ ఈ విషయాన్ని తెలుసుకోలేక పోతున్నారు. ఇంకా తాను పట్టిన కుందేటికి మూడు కాళ్లే అన్నట్టుగా వ్యవహరి స్తున్నారు. -- నేను అబద్ధాలు చెప్పను. అవసరమైతే.. మళ్లీ ఓడిపోతా. ఇంకా ప్రతిపక్షంలోనే కూర్చుంటా - అని జగన్ చేసిన వ్యాఖ్యలు.. ఆయనో క్వశ్చన్ మార్క్. ఎవరికీ అర్థం కాదు! అన్న మాటను మరోసారి నిరూపిస్తోంది. రాజకీయాలలో అబద్ధాలు ఉంటాయని.. జగన్ ఎలా అనుకుంటు న్నారో ఆయనకే తెలియాలి. అసలు రాజకీయాల్లో ఉండేది - లౌక్యం - మాత్రమే. నిజం-అబద్ధం అనే పదాలు రాజకీయ నిఘంటువులో ఉండనే ఉండవు. అవసరం - అవకాశం అనే రెండు పట్టాలపై ప్రయాణించే రాజకీయ రైలు.. లౌక్యంగానే ముందుకు సాగుతుంది తప్ప.. - అబద్ధాలు-నిజాలు - అనే సిగ్నళ్లు వేసుకుని.. తనను తాను నియంత్రించు కునే ప్రయత్నం చేయదు. ఈ విషయాన్ని జగన్ గ్రహించాలి. ఓకే.. ఒక వేళ.. ఆయన చెబుతున్నట్టు చంద్రబాబు అలివికాని హామీలు ఇచ్చారని... ఇవన్నీ అబద్ధాలని అనుకుందాం. మరి 2019-24 మధ్య జగన్ చేసింది కూడా - అబద్ధాల - రాజకీయమే కదా! మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చారు. ఏటా మద్యం షాపులను తగ్గిస్తామన్నారు. ఈ రెండు విషయాల ను చూస్తే.. మద్యాన్ని తాగకుండా.. నియంత్రించడం అనేది ప్రభుత్వం చేతిలో లేదని అనుకుందాం. ఎందుకంటే తాగేవాడు ఏదో ఒక రూపంలో ఎక్కడోచోట నుంచి తెచ్చుకుని తాగుతాడు. దీనిని చంద్రబాబైనా.. పవనైనా.. జగనైనా మాన్పించలేరు. కానీ, జగనే చెప్పినట్టు.. మద్యం షాపులను తగ్గించవచ్చుకదా? పైగా షాపులన్నీ.. సర్కారు చేతిలోనే ఉన్నాయి. ఎందు కింత వివరణ ఇచ్చు కోవాల్సి వచ్చింది.. కానీ.. ఆయన తొలి ఏడాది 22 శాతం షాపులు తగ్గించారు. ఆ తర్వాత నాలుగేళ్లు వదిలేశారు. మరి దీనిని బట్టి ఆయన ఇచ్చిన ఎన్నికల హామీని అబద్ధం అనుకోవా లి! ఇక, 22 మంది ఎంపీలు ఉన్నా.. హోదా తీసుకురాలేక పోయారు.. దీనిని కూడా అబద్ధమనే అనుకోవాలి. ఇది జగన్ కాన్సెప్టులో చూస్తే.. అలానే అనిపిస్తుంది. కానీ, రాజకీయ కోణంలో చూస్తే.. లౌక్యమనే అనాలి. కాబట్టి.. ఇప్పటికైనా.. జగన్ లౌక్యంగా అడుగులు వేయాలి. ఏది ఎప్పటికి అవసరమో.. అప్పటికి మాట్లాడి.. అధికారం దక్కించుకునేలా ఉండాలే తప్ప.. మడి కట్టుకుని కూర్చుంటానంటే.. పార్టీకే నష్టం!!

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. 16,347 టీచర్

## పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేస్తుందోచ్

అమరావతి, : ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ మరో 10 రోజుల్లో వచ్చేస్తుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నిరుద్యోగుల నిరీక్షణకు ఎట్టకేలకు తెర పడనుంది. నవంబరు 3వ తేదీన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డీఎస్సీ ప్రకటన ద్వారా మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే కూటమి సర్కార్ ప్రకటించింది కూడా. ప్రస్తుతం జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీతో ముగుస్తాయి. అనంతరం టెట్ ఫలితాలను నవంబరు 2న ప్రకటిస్తారు. మెగా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 6,371, స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టులు 7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ పోస్టులు1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ పోస్టులు 286, ప్రిన్సిపాల్ పోస్టులు 52, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు 132 వరకు ఉన్నాయి. ఇక ఇప్పటికే టెట్‌లో మంచి స్కోర్ సాధించిన అభ్యర్ధులు సమయం వృద్ధా చేసుకోకుండా డీఎస్సీ ప్రిపరేషన్ ప్రారంభించారు. అధికమంది డీఎస్సీ కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక వేలకు వేలు చెల్లించి కోచింగ్ తీసుకోలేని వారు ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్ ప్రారంభించారు. డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్ధులను మాత్రమే ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత బోధన, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ప్రభుత్వం కల్పించనుంది. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో ఆయా జిల్లాల్లో మూడు నెలల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ కింది లింక్‌పై క్లిక్ చేసి, దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు.

**ఏపీ డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ అప్లికేషన్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి.**

వెబ్‌సైట్లో టెట్ ప్రిలిమినరీ 'కీ'.. :- అక్టోబర్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ టెట్ జులై 2024 పరీక్షల ప్రశ్నపత్రాలు, ప్రిలిమినరీ 'కీ'లతోపాటు రెస్పాన్స్ షీట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పేపర్ 1ఎ, 1బి పరీక్ష ప్రిలిమినరీ 'కీ'లపై అభ్యంతరాలను అక్టోబర్ 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తెలియజేయాలి. మిగిలిన పరీక్షలకు సంబంధించిన క్వశ్చన్ పేపర్లు, ఆన్సర్ 'కీ'లు పరీక్ష జరిగిన తర్వాతి రోజుల్లో విడుదల కానున్నాయి. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో జరుగుతున్న ఈ పరీక్షలు 21వ తేదీతో ముగుస్తున్నాయి. అక్టోబర్ 27న తుది 'కీ' విడుదల చేసి, నవంబర్ 2న ఫలితాలు ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మూసీ ప్రాజెక్టు ఖర్చెంత..?

## బీఆర్ఎస్, కాంగ్రెస్ చెప్తున్న లెక్కల్లో వాస్తవమెంత..?

మొదటి పేజి తరువాయి

మూసీ సుందరీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించగా.. బీఆర్ఎస్ ముందు నుంచీ అడ్డుపడుతోంది. ముఖ్యంగా మూసీ పరిధిలోని నిర్వాసితులను ఖాళీ చేయించేందుకు వ్యతిరేకిస్తోంది. మూసీ సుందరీకరణతో ఎవరికి ఉపయోగం అంటూ నిలదీస్తోంది. కేవలం అప్పనంగా దోచుకునేందుకే ఈ ప్రాజెక్టును ముందరేసుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. / రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అప్పనంగా రాష్ట్రం నుంచి సొమ్మును దోచుకొని ఢిల్లీకి సూటుకేసులు తరలిస్తున్నారని బీఆర్ఎస్ లీడర్లు ఆరోపిస్తున్నారు. అందుకే మూసీ ప్రాజెక్టుతో పెద్ద ఎత్తున దోపిడీ కోసమే ఈ సుందరీకరణ పనులు మొదలు పెడుతున్నారని అంటున్నారు. అయితే.. ఏకంగా లక్షా 50వేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలు సందర్భాల్లో ఆరోపించారు. అందులో 50వేల కోట్లు ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టి.. లక్ష కోట్లను ఢిల్లీకి తరలించేందుకు సిద్ధమయ్యారని ఆయన ప్రధాన ఆరోపణ. కేవలం దోచుకో.. దాచుకో అన్నట్లుగానే కాంగ్రెస్ పాలన నడుస్తోందని అంటున్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బదులిచ్చారు. బీఆర్ఎస్ ఆరోపణలను ఆయన ఖండించారు. లక్షా 50వేల కోట్లతో నిర్మించడానికి ఇదేమైనా కాళేశ్వరం ప్రాజెక్టా అని ప్రశ్నించారు. దోచుకునే అలవాటు మీదని.. ప్రజలకు మంచి చేసే అలవాటు తమదని చెప్పుకొచ్చారు. డిటైల్డ్ రిపోర్ట్ తయారు చేసేందుకు 5 కంపెనీలకు సంబంధించిని కన్సార్టియానికి పనులు అప్పగించినట్లు తెలిపారు. అందుకు రూ.141 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మురీసీ సుందరీకరణ కాదని.. పునరుజ్జీవం అని వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు తాము కేవలం 141 కోట్లు కేటాయిస్తే.. ఈ లక్షా 50వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో బీఆర్ఎస్ లెక్కలు చెప్పాలని సవాల్ విసిరారు. అయితే.. ఇరుపార్టీల సవాళ్లు, ప్రతిసవాల్ల నేపథ్యంలో ఇప్పుడు ప్రజల్లోనూ కొత్త కన్ఫ్యూజన్ మొదలైంది. అసలు మూసీ ప్రాజెక్టు సుందరీకరణ చేపడుతున్నారు సరే.. దానికి ఎంత ఖర్చు చేస్తారనేది క్లారిటీ లేకుండా పోయింది. బీఆర్ఎస్ పార్టీ ఏమో లక్షా 50వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతోంది. కానీ.. ముఖ్యమంత్రి మాత్రం ఇప్పటివరకు 141 కోట్లు కేటాయించామని అంటున్నారు. ఇప్పటివరకు 141 కోట్లు కేటాయిస్తే.. భవిష్యత్తులో నిర్మాణాలన్నింటికీ ఎన్ని వేల కోట్లు ఖర్చు చేస్తారనేది ఎక్కడా చెప్పలేదు. దాంతో అసలు ఈ ప్రాజెక్టు వ్యయం ఎంత..? అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. మొత్తానికి ఖర్చు విషయంలో మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాత్రం రోజూ మాటల తూటాలైతే పేలుతున్నాయి. అసలు బీఆర్ఎస్ చెబుతున్న లెక్కలు కరెక్టా.. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవమా అనేది తేల్చుకోలేకపోతున్నారు. మొత్తానికి మూసీ ప్రాజెక్టు ఖర్చు అంశం చివరకు రేవంత్, కేటీఆర్ సవాళ్లు చేసుకునే స్థాయికి చేరింది. డిటైల్డ్ రిపోర్టు వచ్చాకే ఖర్చుపై ప్రభుత్వం క్లారిటీ ఇస్తుందా అనేది చూడాలి మరి.

## అమరావతి పనుల పునఃప్రారంభం.. విశాఖను ఆర్థిక

## రాజధానిగా చేస్తామన్న సీఎం చంద్రబాబు

అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. తుళ్లూరు మండలం లింగాయపాలెం-ఉద్దండరాయునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. భవన ప్రాంగణంలో మంత్రి నారాయణతో కలిసి చంద్రబాబు పూజా కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌డీఏ కార్యాలయం పనుల ద్వారా రాజధాని నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించింది. రూ.160 కోట్లతో నాడు ఏడు అంతస్తుల్లో కార్యాలయ పనులను సీఆర్డీఏ చేపట్టింది. ఈ నెల 16న జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పనుల ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ ప్రాజెక్ట్ ఆఫీస్ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించింది. మొత్తం 3.62 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 భవనాన్ని 2,42,481 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనుంది. భవనం నిర్మాణం కోసం ఇప్పటివరకూ రూ.61.48 కోట్ల ఖర్చుపెట్టింది. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ సిస్టమ్స్, ఇతర వర్క్స్ ఇంకా పూర్తి కావాల్సి ఉన్నాయి. బ్యాలెన్స్ పనుల పూర్తికి రూ.160 కోట్లు ఖర్చు అవుతుందని సీఎం తెలిపారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం అమరావతి అని చంద్రబాబు అన్నారు. ఒక రాష్ట్రం.. ఒకే రాజధాని అని మరోసారి సీఎం తెలిపారు. ఇక వైజాగ్‌ను ఆర్థిక రాజధానిగా చేస్తామన్నారు. అలాగే కర్నూల్‌లో హైకోర్టు బెంచ్, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

### మూడు నెలలు మూసీ పక్కనే ఉంటా: రేవంత్ రెడ్డి సవాల్‌కు సిద్ధమేనన్న కేటీఆర్

మొదటి పేజి తరువాయి

మూడు నెలల పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో ఉండాలని, అక్కడ ఉంటే కనుక వారు చెప్పినట్లు తాను నడుచుకుంటానని సీఎం ఇటీవల అన్నారు. ఈ సవాల్‌ను కేటీఆర్ స్వీకరించారు. మూసీ పక్కన మూడు నెలలు ఉండేందుకు తాము సిద్ధమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది బ్యూటిఫికేషన్ కాదని... లూటిఫికేషన్ అని అన్నారు. నాగోల్‌లోని మురుగు శుద్ధి కేంద్రాన్ని మాజీ మంత్రులు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాడు రూ.386 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం 31 మురుగు శుద్ధి కేంద్రాలను నిర్మించేందుకు సిద్ధమైందన్నారు. వారసత్వ సంపదలను కాపాడుతూనే అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని పేర్కొన్నారు. రూ.545 కోట్లతో 15 బ్రిడ్జిలు నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.మూసీ నిర్వాసితులకు ఇస్తున్న ఇళ్లు కూడా కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లే అన్నారు. మూసీ పక్కన మూడు నెలల పాటు ఉండాలని తనకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారని, ఆయన సవాల్‌కు తాను సిద్ధమే అన్నారు. దమ్ముంటే మూసీ నది లోతు పెంచి... కోల్‌కతా వంటి నగర నిర్మాణం చేయాలన్నారు. మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారి తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు.

### గ్రూప్ 1 అభ్యర్థుల ర్యాలీలో తోపులాట.. బండి సంజయ్, ఆ ప్రవీణ్ అరెస్ట్

మొదటి పేజి తరువాయి

దీంతో గ్రూప్-1 అభ్యర్థుల ర్యాలీ రెండుగా చీలిపోలింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరస్తాకు వెళ్లారు. గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం చలో సచివాలయానికి పిలుపునిచ్చారు. గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి సచివాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. వీరి ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. సచివాలయానికి వెళ్లి సీఎంను కలుస్తానని స్పష్టం చేసిన బండి సంజయ్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు తప్పుకోవడంతో ర్యాలీగా సెక్రటేరియట్ వైపునకు కదిలారు బండి సంజయ్. 'ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించాలని, జీవో 29ను రద్దు చేయాలని' బండిసంజయ్ డిమాండ్ చేశారు. 29 జీవో ఎందుకు తీసుకొచ్చారు? రిజర్వేషన్ల వ్యవస్థను రద్దు చేయదలుచుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రేవంత్ పాలన నిజాంను తలపిస్తోంది. ప్రభుత్వం మొండిపట్టు వీడాలి. గ్రూప్ 1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జ్ సరికాదు. కోర్టును కూడా ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోంది. హైకోర్టు తీర్పును గౌరవించాల్సిందేనని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీంతో సచివాలయానికి ర్యాలీగా వెళ్తున్న బండి సంజయ్‌ని మళ్లీ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద మళ్లీ పోలీసులు అడ్డుకుని, ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను కారులో ఎక్కించుకుని పోలీసులు తీసుకెళ్లారు. దీంతో పోలీసుల వాహనాన్ని గ్రూప్-1 అభ్యర్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, గ్రూప్-1 అభ్యర్థుల మధ్య తోపులాట జరిగింది. గ్రూప్-1 అభ్యర్థులను పోలీసులు చెదరగొట్టారు. మరోవైపు తెలుగు తల్లి ఫ్లైఓవర్ దగ్గర బీఆర్ఎస్ నేతలను వరుసగా పోలీసులు అరెస్ట్ చేశారు. 29 జీవోను రద్దు చేసి తీరాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఏ పార్టీతో సంబంధం లేదు. 'రాజకీయాలు కాదు, విద్యార్థుల భవిష్యత్ చూడాలని అన్నారు. విద్యార్థుల పక్షాన అన్ని పార్టీలు పోరాటం చేస్తాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులతో వెంటనే చర్చించాలని' శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్క్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలతో హైదరాబాద్ అట్టుడుకింది. అశోక్‌నగర్ టు లోయర్ ట్యాంక్‌బండ్ ర్యాలీలతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు హోరెత్తించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అనంతరం బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్‌లను కూడా అరెస్ట్ చేశారు. ఇక గ్రూప్ 1 అభ్యర్థుల మెరుపు ధర్నాతో లోయర్ ట్యాంక్‌బండ్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ దద్దరిల్లింది. గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా వెళ్లిన కేంద్రమంత్రి బండి సంజయ్‌ని.. బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# పోలీసుల త్యాగాలు మరువలేనివి!!

**పోలీస్ అమరవీరులకు దేశం నివాళులు!!**
**తల ఎత్తుకొని సేవ చేసే పోలీసులు**
**తలదించుకున్న చీకటి రోజు!!**
**నేడే అమరవీరుల దినోత్సవం!**
**పోలీస్ అమరవీరుల సాస్మరణ దినానికి**
**నిండిన 64 ఏళ్లు!!**

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఈ దేశం ఈ ప్రపంచం మొత్తం కూడా 24 గంటలు నిద్రపోయినా కూడా పోలీస్ వ్యవస్థ మాత్రం 24 గంటలు కళ్ళు తెరుచుకొని నిద్రాహారాలు మాని కుటుంబాలను దూరం పెట్టుకొని భార్య పిల్లలు అంటే తెలవని పోలీస్ వ్యవస్థ ఈరోజు సగర్వంగా ఈ దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన చీకటి రోజు అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల దినోత్సవం గా 1959లో భారతదేశం ప్రకటించింది, ఈరోజు పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకోవడానికి ప్రధాన కారణం 1959 అక్టోబర్ 21న చైనా దేశం సరిహద్దులో చైనా ఉగ్రవాదులు జరిపిన దాడులకు భారత సైన్యం సమర్థంగా తిప్పి కొట్టిన రోజు ఆ యుద్ధంలో ఎందరో భారత సైనికులు వీరమరణం పొందారు, దేశ సరిహద్దులో ప్రాణాలను లెక్కచేయకుండా చివరకు చనిపోయిన భారత జవాన్ల శవాలు ఇంటికి ముట్టకుండా పోయిన రోజు ఆ రోజు ఒక్కసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది, దేశ సరిహద్దుల్లో లడఖ సరిహద్దులో దేశ ప్రజలను కాపాడుతున్న పదిమంది భారత సైనికులు చైనా దేశం జరిపిన కాల్పులలో మన దేశానికి చెందిన సిఆర్పిఎఫ్ జవాన్లు అక్కడికక్కడే మరణించారు, ఆ దుర్ఘటన జరిగి కన్నీటికి 64 సంవత్సరాలు పూర్తవుతుంది, 24 గంటలు భార్యా పిల్లలు, కుటుంబం



బంధుమిత్రులు ,పండుగలు, శుభకార్యాలు, జవాన్ల పిల్లల పుట్టిన తేదీలు కూడా జరుపుకోలేని దుస్థితి మనదేశంలో ఇప్పటికీ వెంటాడుతుంది, అందుకే ఆనాడు అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడానికి నిర్ణయించారు ,ఆ రోజు నుంచి మనదేశంలో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం మొక్కుబడిగా చేస్తూ రాజకీయ పార్టీల నాయకులు పాలక



MD.ZOHAIB IQBAL, ARPC 1118
. 123/93 of Kollapur PS), Dt.14.11.1993



JAYA RAMULU, PC 1026 OF VEEPANGANDLA
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.199



RANGA REDDY ARHC 1400
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.1993



SHAIK HYDER, ARPC 163
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.1993

ప్రభుత్వాలు పోలీసులకు ఇవ్వవలసినటువంటి జీతభత్యాలు ఇతర అలవెన్స్ టి ఎ డి ఏ లు, హెచ్ఆర్ఏలు, ఇవ్వకుండా పోలీసులను రాజకీయంగా అణగదొక్కుతూ బెదిరిస్తూ పాలక ప్రభుత్వాలు పోలీస్ శాఖ పైన ఉక్కు పాదాలు మోపిస్తున్నాయి, పోలీస్ అమరవీరుల స్వస్మరణ దినోత్సవం రోజు ఊకదుంపుడు




ఉపన్యాసాలు చేసి చేతులు దులుపుకోవడం తప్ప పోలీసులకు ఉన్న ఇబ్బందులను పట్టించుకునే నాధుడు లేడు, ఆరోజు ఏదో ఒక రక్తదాన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు, నిర్వహించి చేతులు దులుపుకోవడం కంటే పోలీసులు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జీవితాంతం వాళ్ళ అడుగుజాడలో పయనిస్తామని ప్రమాణ స్వీకారం చేయాలని అప్పుడే ఈ భారతదేశం అభివృద్ధి దశలో ముందుకు పోతుందని పలువురు మేధావులు అంటున్నారు, నిద్రలేని పోలీసులు ప్రజల కోసం సేవ చేస్తే కూడా పోలీసులను అక్రమ బదిలీలు అక్రమ సస్పెన్షన్ వేధింపులు వెంటనే పాలక ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని ప్రజలకు డిమాండ్ చేస్తున్నారు,

**మహబూబ్ నగర్ జిల్లాలో మావోయిస్టుల దొంగ దెబ్బ!!**
**మావోయిస్టుల మందు పాత్ర జిల్లా ఎస్పీ హతం!!**



KISHORE KUMAR, SIP OF KODAIR PS
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.1993



SHIVA PRASAD, SIP OF KOLLAPUR PS
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.1993



Y.V.N.PRASAD, PC 1797 OF VEEPANGANDLA PS
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.1993



SUBHAN, PC 1400 OF KODAIR PS
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.19



SHAIK FAHEEMUDDIN, PC 785 OF TALAKONDAPALLY PS
(Cr.No. 19/94 of Talakondapally PS) Dt.08.05.1994



MURALIDHER REDDY, PC 1847 OF KOLLAPUR
(Cr.No. 82/96 of Kollapur PS) Dt.05.05.199

**జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు తో పాటు పదిమంది పోలీసులు మృతి!!**

ఒక యంగ్ డైనమిక్ ఐపీఎస్ ఆఫీసర్ 1963 లో జన్మించి 1987లో పోలీస్ శాఖలు చిన్న వయసులో జిల్లా ఎస్పీగా పనిచేసిన పరదేశి నాయుడు మావోయిస్టుల మందు పాత్రకు ప్రాణాలు కోల్పోయారు,నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 23 జిల్లాలతో విస్తరించిన ఆనాటి రాష్ట్రంలో తెలంగాణలోని పది జిల్లాలలోని ఒకటైన మహబూబ్ నగర్ జిల్లా మావోయిస్టులకు పెట్టని పేరు, ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మావోయిస్టుల పైన నిషేధం ఎత్తివేసిన సందర్భంలో విచ్చలవిడిగా మావోయిస్టులు తెలంగాణలో ముఖ్యంగా కొల్లాపూర్ ,నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గం తమ కార్యకలాపాలను నిర్వర్తించుకుంటూ ఉనికి చాటుకుంటూ గ్రామాలలో బహిరంగంగా ప్రజా కోర్టులు నిర్వహించి ప్రజలను భూస్వాములను టిడిపి, బిజెపి పార్టీల నాయకులను పట్టపగలు కాల్చి చంపిన సంఘటనలు ఇప్పటికీ మాయని మరకలుగా మిగిలిపోయాయి, ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల్లో 1993 నవంబర్ 13







PRABHAKAR, PC 1267 OF KOLLAPUR PS
No. 75/91 of Kollapur PS), Dt. 14.12.1991



PARADESHI NAIDU, IPS
(Cr.No. 123/93 of Kollapur PS), Dt.14.11.199

సాయంత్రం ఐదు గంటల సమయంలో కొల్లాపూర్ నల్లమల్ల అటవీ ప్రాంతంలో గల సోమశిల గ్రామానికి సమీపంలో శుద్ధగట్టు దగ్గర మావోయిస్టులు ముందుగానే పకడ్బందీ ప్రణాళికతో ఒక ఫారెస్ట్ గెస్ట్ హౌస్(అతిథి గృహం) ను మందు పాత్రతో పేల్చివేశారు, ఈ సంఘటన తెలుసుకున్న పోలీసులు ఇక్కడికి వస్తారని భావించిన మావోయిస్టు నల్లమల దళ కమాండర్, సరళ సాగర్, పానగల్ దళం, పేరుతో నా కొల్లాపూర్ నియోజకవర్గం లోని అనుభవం కలిగిన కొంతమంది మావోయిస్టులు సానుభూతిపరులు మావోయిస్టు ఉద్యమాల్లో పని చేస్తూ ముందుగానే పోలీసులు వస్తారని భావించి శుద్ధగట్టు దగ్గర మందు పాత్ర పెట్టారు, ఈ విషయం పసిగట్టని అప్పటి జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు హుటా హుటిన సంఘటన స్థలాన్ని చేరుకోవడానికి అప్పటి కొల్లాపూర్ ఎస్సై గా పని చేస్తున్న శివప్రసాద్, కోడేరు ఎస్సై కిషోర్ కుమార్, పెద్దకొత్తపల్లి ఎస్సై రమేష్ రెడ్డి, తో పాటు పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ జోయెజ్ ఇక్బాల్, తోపాటు జయ రాములు కానిస్టేబుల్ వీపనగండ్ల, పోలీస్ స్టేషన్, రమేష్ రెడ్డి కానిస్టేబుల్ కొల్లాపూర్, షేక్ హైదర్, ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ కొల్లాపూర్, షేక్ షఫియోద్దీన్ పోలీస్ కానిస్టేబుల్ తలకొండపల్లి, మురళీధర్ రెడ్డి పోలీస్ కానిస్టేబుల్ కొల్లాపూర్, ప్రభాకర్ పోలీస్ కానిస్టేబుల్ కొల్లాపూర్ పోలీస్ స్టేషన్, వైవిఎం ప్రసాద్ కానిస్టేబుల్ వీపనగండ్ల, సుభాన్ కానిస్టేబుల్ కోడేరు, తో పాటు మరికొంతమంది పోలీసులు సోమశిల దగ్గర మావోయిస్టులు మందు పాత్రతో పేల్చిన గెస్ట్ హౌస్ను పరిశీలించడానికి వెళ్లారు, అక్కడే మాటు వేసిన మావోయిస్టులు దొంగ చాటున పెట్టిన మందు పాత్రకు పోలీసులు దారుణంగా చనిపోయారు, ఈ ఈ దొంగదెబ్బ సంఘటనలో వీరమరణం పొందినారు, అయినా ఈ ఘటనలో అప్పటి మందు పాత్ర దుర్ఘటనలో పెద్దకొత్తపల్లి ఎస్సై రమేష్ రెడ్డి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు తమ వెడమకాలకు తీవ్ర గాయాలు కావడమే కాక ఒక కాలు విరిగిపోయిన కూడా నిరంతరం మావోయిస్టులపై కాల్పులు జరిపినట్లు ఇప్పటికీ ఆనాటి సంఘటన వివరాలు రమేష్ రెడ్డి దగ్గర పూర్తి వివరాలు గౌతమ్ న్యూస్ దినపత్రిక ప్రతినిధి సేకరించడం జరిగింది, ప్రస్తుతం ఆయన తెలంగాణ రాష్ట్రంలో స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ (రిజిస్ట్రేషన్ శాఖ) లో రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవి చేస్తున్నారు, మిగతా పోలీస్ సిబ్బంది మావోయిస్టుల మందు పాత్రకు అక్కడికక్కడే బలైపోయారు, ఈ సంఘటనలో అప్పటి ప్రైవేట్ బస్సు సాంబయ్య నెంబర్ ఏపిఎం 7555 గల బస్సు డ్రైవర్ శాలి పాషా మీ దుర్ఘటన లో చనిపోయారు, ఈ సంఘటన ఇప్పటికీ మరపురాని మాయని మచ్చగా సోమశిల పరదేశి నాయుడు ఎన్కౌంటర్ శుద్ధగట్టు పేరు తెలంగాణ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో కూడా మారు మోగుతుంది, ఇంత ఘోరమైన సంఘటన జరిగినా కూడా అప్పటి జిల్లా ఎస్పీఎస్పీ పరదేశి నాయుడు తన అవయవాలు ముక్కలు చెక్కలు అయినా ప్రాణం పోయినా కూడా చివరి శ్వాస వరకు పోరాటం చేసి తోటి తన సిబ్బందిని ఆత్మస్థైర్యం కోల్పోకుండా కాల్పులు జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆ ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ పెద్దకొత్తపల్లి ఎస్సై రమేష్ రెడ్డి గౌతమ్ న్యూస్ దినపత్రిక రాష్ట్ర నెట్వర్క్ఇన్చార్జి రవిశంకర్ గౌడ్ వివరించారు, గౌతమ్ న్యూస్ దినపత్రిక ప్రతినిధి సొంత గ్రామం అదే మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన ఆయన ఆంధ్రభూమి దినపత్రిక విలేకరిగా అప్పట్లో కొంతకాలం కోడేరు మండలంలో పనిచేస్తూ ఆ తర్వాత 1994 సంవత్సరంలో పెద్దకొత్తపల్లి మండలం లో ఆంధ్రభూమి దినపత్రికల్లో 2001 వరకు పనిచేశారు, ఈ సంఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న తనకు తెలిసిన అన్ని విషయాలను ప్రజల ముందు ఉంచడానికి ముందుకు రావడం జరిగిందని ఆ రోజుల్లో చిన్న వయసు ఉన్నప్పటికీ పెద్దకొత్తపల్లి ఎస్సైగా పనిచేసిన రమేష్ రెడ్డితో ఆయన జరిగిన ఘటన గురించి వివరాలు సేకరించి ప్రజలకు వివరిస్తున్నారు, సోమశిల మందు పాత్ర ఘటనలో ఎస్పీ పరదేశి నాయుడు చివరి శ్వాస వరకు మావోయిస్టులపై కాల్పులు జరుపుతూ తోటి పోలీసులు అని కూడా ధైర్యం నింపి కాల్పులు జరపాలని ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ఆయన గట్టిగా పదే పదే చెప్పడం వల్ల పోలీసులు తమ తుపాకులను పెక్కుపెట్టి మావోయిస్టుల పై కాల్పులు జరిపినట్లు తెలిసింది, ఈ మందు పాత్రలో లో చాలా మంది . మావోయిస్టులు చనిపోయినట్లు మరుసటి రోజు ఆయా చుట్టూ ప్రాంతాల గ్రామాల ప్రజలు పోలీసుల వివరించారు, చనిపోయిన మావోయిస్టులను కుటుంబాలకు అప్పజెప్పకుండా రహస్యంగా దాన సంస్కారాలు నిర్వహించినట్లు అప్పట్లోనే బయటకు వచ్చింది, ఘోరమైన మందు పాత్ర ఘటన పైన కొల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో. క్రైమ్ నెంబర్ 123/93 ,147,148,302,307 మరియు149 ఐపీసీ సెక్షన్251/%ఖ% 35 కేసులు నమోదయ్యాయి, మీద ఈ దుర్ఘటన పైన పూర్తి వివరాలతో మీ ముందుకు వస్తాం , 1993 నవంబర్ 13 రోజు సాయంత్రం 6 గంటలకు జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు మందు పాత్ర మరణం గురించి మరికొన్ని విషయాలు తెలుసుకుందాం అంతవరకు గౌతమ్ న్యూస్ దినపత్రికను చూస్తుండండి

## బిజెపి సభ్యత్వానికి విశేష స్పందన!!

**వనపర్తి లో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం!!**
**బిజెపి జిల్లా అధ్యక్షులు డి, నారాయణ వెల్లడి**



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): భారతీయ జనతా పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా గత నెల రోజుల నుంచి చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఎక్కడ చూసినా యువకులు, మహిళలు, రైతులు బిజెపిలో స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్ అన్నారు, శనివారం వనపర్తి పట్టణంలోని ఇంద్ర పార్క్ దగ్గర బిజెపి జిల్లా ఎస్టీ గిరిజన మోర్చా అధ్యక్షులు రవి నాయక్, ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆయన అన్నారు, ఇప్పటికే వనపర్తి జిల్లాలో దాదాపు 15 వేల సభ్యత్వాలు పూర్తి చేయడం జరిగిందని మరి కొన్ని రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని ఆయన అన్నారు, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా ప్రజలు భావిస్తున్నారని అందువల్లనే సభ్యత్వం తీసుకోవడానికి స్వచ్ఛందంగా వస్తున్నారని అన్నారు, ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, పట్టణ యువమోర్చా అధ్యక్షులు రాజు, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వివిధ మండలాలకు చెందిన బిజెపిఎస్టీ మోర్చా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు,



## ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్ ప్రదానంపై మక్తల్ టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

మక్తల్(గౌతమ్ న్యూస్): ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ వాకిటి శ్రీహరి గారికి ప్రఖ్యాత అమెరికా యూనివర్సిటీ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడంపై మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ రవికుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా మందంజలో నిలిచే వాకిటి శ్రీహరి గారు ఇప్పటికే ఎన్నోసార్లు తన సేవా తత్పరతతో ముందంజలో నిలిచారని అన్నారు. నియోజకవర్గ ప్రజలే కాకుండా.. రహదారులపై ఎవరికి ఎలాంటి చిన్న ఆపద కలిగినా తాను ఉన్నానంటూ భరోసా కల్పించి .. వారికి చేయూత





కల్పించే దిశగా చేపట్టిన సేవా కార్యక్రమాలు అద్భుతం అని కొనియాడారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారు రక్తదానం చేయడంలో గాని, చనిపోయిన వారి కుటుంబ సభ్యులను ఆదుకోవడం గాని, ఆసుపత్రిలో ఉన్న వారికి భరోసా కల్పించడంలో గానీ.. అన్ని విధాలుగా ముందంజలో ఉన్నారని.. ఇలాంటి వారికి గౌరవ డాక్టరేట్ చాలా చిన్నదని.. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు వాకిటి శ్రీహరి గారికి దక్కాలని మనసారా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కట్ట సురేష్ కుమార్ గుప్తా, బి.గణేష్ కుమార్, వల్లంపల్లి లక్ష్మణ్, గొల్లపల్లి నారాయణ , చెన్నయ్య సాగర్ ,ఏ. రవికుమార్, మందుల నరేందర్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, కున్సీ నాగేందర్ , కావలి తాయప్ప ,వాకిటి శ్యామ్, గద్వాల్ రవి, కావలి ఆంజనేయులు, అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ నూరుద్దీన్, ఫయాజ్, ఉస్మాముద్దీన్, పెద్దింటి మల్లేష్ ,బహదూర్, మెకానిక్ రాము ,దండు వెంకట్ రెడ్డి , బోయ నరసింహ ,మంజూరు ఇలాహి,అఫ్రోజ్, పీర్ పాషా, రత్న కుమార్ ,బండారి శేఖర్, ఆనంపల్లి రమేష్, శేఖర్, నర్సింలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నిత్యానందరావు నియామకం పట్ల హర్షం


Dr.V NithyanandaraoSir

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఆచార్య వెలుదండ నిత్యానంద రావు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గా ఎన్నిక కావడం పట్ల వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ అధ్యాపకుడిగా ఆచార్యుడిగా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో సేవలందించారని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా,బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ గా తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడమే గాక ఎంతో మంది పి. హెచ్ డి ,ఎం.ఫిల్ విద్యార్థులకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారని తెలిపారు. ఆయన నియామకం పట్ల సాహితీవేత్తలు జనజ్వాల,కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్ర శేఖర్, డా. తూర్పింటి నరేష్ కుమార్,డా. బి. శ్యాం సుందర్,డా. భానుప్రకాశ్,బండారు శ్రీనివాస్ తదితరులు హర్షంవ్యక్తంచేశారు.

## రహస్యంగా ఇందిరమ్మ కమిటీలు ఎన్నిక

### భూక్య చిరంజీవి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా చిన్నగూడూరు మండలంలో అన్ని గ్రామపంచాయతి ప్రజలందరికీ నమస్కారం. ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వటం కొరకు గ్రామ కమిటీలు గ్రామ సభ నిర్వహించి గ్రామ ప్రజలందరికీ తెలిసే విధంగా కమిటీలు నిర్వహించాలి. గ్రామసభ నిర్వహించకుండా గ్రామంలో తండాలో ఉన్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు రహస్యంగా పేర్లను మండల అధికారి కి పంపినారు. ఈ కమిటీ వాళ్లు కాంగ్రెస్ లీడర్లు ఎవరికి చెప్తే వాళ్లకు ఇల్లు మంజూరు అయ్యే విధంగా వాళ్ల అనుచరులను కమిటీలో తీసుకోవద్దు ఈ పద్ధతి మంచిది కాదని చిన్న గూడూరు మండల. ఎంపీడీఓ మరియు గ్రామ కార్యదర్శి ని బీఆర్ఎస్ పార్టీ నుంచి కోరుకుంటున్నాను. లేని యెడల గ్రామంలో, తండాలో తీవ్ర వాగ్వాదానికి దారి తీస్తుంది. దయచేసి వేసిన కమిటీని రద్దు చేసి గ్రామ సభ నిర్వహించి ప్రజల సమక్షంలో కమిటీ వెయ్యాలి.

## పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి, బలరాం నాయక్ లను సత్కరించిన

### రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): పాల్వంచ : దిశ సమావేశానికి పాల్వంచకు విచ్చేసిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్ లను డీసీఎంఎస్ చైర్మన్ రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన దిశ సమీక్ష సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన వీరికి కొత్వాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికి వారిని శాలువా బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పిటిసి ఎర్రం శెట్టి ముత్తయ్య, కొత్తగూడెం మాజీ జెడ్పిటిసి గిడ్ల పరంజ్యోతి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు ఎస్ఏ జలీల్ ,శనగా రామచందర్, ఎర్రం శెట్టి మధుసూదన్ రావు, ఉండేటి శాంతి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు

## సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ!!

### డీఈఓ గోవిందరాజు!!






నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా పరిధిలోని పెబ్బేరు మండలం యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎం.గోవిందరాజు శనివారం భూమి పూజ చేశారు. ప్రతి మూడవ శనివారం పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ మీటింగ్స్ ను పరిశీలించడానికి వచ్చిన ఆయన యాపర్లకు చేరుకొని అక్కడి హై స్కూల్ లో భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి. ఈ. ఓ గోవిందరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల లో నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించడంలో తమ శాయశక్తులా కృషి చేస్తున్నామని ,పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తున్నామని వివరించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్యను పెంచాడానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయ పడ్డారు. యాపర్ల హై స్కూల్ ను దత్తత తీసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్న దాతలు నరేందర్ రెడ్డి ఆయన కుమారుడు



శ్రీహరి రెడ్డిని అభినందించారు. గ్రామీణ స్థాయి పాఠశాలలను తీర్చి దిద్దడంలో అక్కడి ప్రజల సహకారం ఉండాలని డి ఈ ఓ గోవిందరాజు పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు రెగ్యులర్ గా విద్యార్థుల పాఠశాలకు పంపించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈనాటి కార్యక్రమంలో హెడ్ మాస్టర్ పలుస శంకర్ గౌడ్, స్కూల్ కాంప్లెక్ హెచ్ ఎం నరసింహా రావు,ఉపాధ్యాయులు వెంకటేశ్,మెయినోద్దీన్,ఈశ్వర్ రెడ్డి,చంద్ర శేఖర్ రెడ్డి, వెంకటేష్ శర్మ,స్వరాజ్యం బాబు రెడ్డి, చైర్మన్ జయమ్మ ఉపాధ్యాయులు బాలమ్మ, ఇందిర,రమేష్, ఆంజనేయులు, కవిత, శివాని గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ల గ్రామం బిజ్వారం!!

### 26 మంది ఎంబిబిఎస్ డాక్టర్లు!! ఒకే గ్రామంలో రికార్డు సృష్టించిన మెడికల్ విద్యార్థులు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): రాను రాను వైద్య వృత్తి ఎంతో ఖరీదు అయినప్పటికీ వైద్య వృత్తి విద్య అభ్యసించడానికి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు దూరమవుతున్న తరుణంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటి చెప్పి ఒకే గ్రామంలో 26 మంది ఎంబిబిఎస్ డాక్టర్ సీట్లను సాధించి రికార్డ్



సృష్టించారు, గద్వాల జోగులాంబ జిల్లా పరిధిలోని మల్లకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన విద్యార్థులు మెడికల్ సీట్లలో జిల్లాలోని కాక రాష్ట్రంలో కూడా రికార్డు సృష్టించి అత్యధికంగా ఒకే గ్రామంలో ఇంత మంది విద్యార్థులు మెడికల్ విద్య వైపు అడుగులు వేయడం పట్ల ఆ గ్రామ ప్రజలు జిల్లా ప్రజానీకం అభినందనల వర్షం కురిపిస్తున్నారు,


రమ్య గౌడ్ ఎంబిబిఎస్ విద్యార్థి

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న బిజ్వారం గ్రామం గద్వాల జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది ఆ గ్రామంలో ఎక్కువ శాతం రైతులు రైతు కూలీలు కార్మికులు ఉన్నారు, ఆర్థికంగా వెనుకబడిన ఆ గ్రామంలో వైద్య వృత్తిలో పేద ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో కష్టాలు నష్టాలు తెలుసుకొని ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన విద్యార్థులు కష్టపడి చదువుకొని మెడికల్ సీట్లు సాధించడం విశేషం, ఈ రోజుల్లో పేద ప్రజలకు వైద్యం





అందక మధ్యలోనే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ధనవంతులకు మాత్రమే వైద్యం అందిస్తున్న ఈ రోజులలో పేద ప్రజల కూడా నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందించి పేద ప్రజలను ఆదుకోవడానికి తమ ముందుకు వస్తున్నామని ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు, మొత్తం మీద ఎంబిబిఎస్ సీట్లు సాధించిన బిజ్వారం గ్రామ మెడికల్ విద్యార్థులు రాబోయే రోజుల్లో గద్వాల ప్రాంతంలోనే గాక తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా తాము వైద్య పరంగా సేవలందిస్తామని ఆశాభవం వ్యక్తం చేశారు, మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందంతో అవధులు లేకుండా పోయాయి, పేదోళ్ల కుటుంబాలలో వైద్యం వికసించడం విరజిల్లడం అందరిలో ఆనందాన్ని నింపింది బుధవారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఎస్ ,రంగన్న గౌడ్ సోదరుడు శంకర్ గౌడ్ కూతురు రమ్య తో పాటు ఆ గ్రామానికి చెందిన ధరణి, స్వీటీ ,సాయివర్ధన్ రెడ్డి, పవన్ కుమార్, శివకుమార్, అజయ్, కిషోర్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, అభినవరెడ్డి, ఝాన్సీ రాణి తో పాటు మరి కొంతమంది ఈ సీట్లు సాధించిన వారిలో ఉన్నారు,

## రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం!!

### టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని నిరసిస్తూ శనివారం టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు పిలుపుమేరకు టిఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం. చేశారు, ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతు భరోసా ఇవ్వలేమని సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వ్యాఖ్యలను నిరసిస్తూ ఈరోజు అంబేద్కర్ చౌరస్తాలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యములో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్ సందర్భంగా రాహుల్ గాంధీ సాక్షిగా రైతులకు డిసెంబర్9 నాటికి 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రుణ మాఫీ కోసం 30వేల కోట్లు






విడుదల చేస్తామని హామీ ఇచ్చి క్యాబినేట్లో 27వేల కోట్లు మంజూరు అని కేవలం 17వేల కోట్లు ఇచ్చి రైతులను దగా చేయడం గాక డిసెంబర్9 తర్వాత రైతు భరోసా క్రింద యాసంగిలో ఒక్క ఏకరాన్నికి 7500 వానకాలానికి 7500 చొప్పున సీజన్ కు 9000వేల కోట్లు ఇస్తామని సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల.నాగేశ్వర్ రావు రైతు భరోసా ఇవ్వలేమని చెప్పడం రైతులను నట్టేట ముంచడమే అని దుయ్యబట్టారు. కౌలు రైతులకు,రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తామని మోసం చేసి గద్దెనెక్కిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందని రైతు భరోసా ఇవ్వలేని రేవంత్ రెడ్డి ముక్కునేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ మంత్రులు రాజీనామా చేయాలని అదేవిధంగా నిరుద్యోగ భృతి ఇచ్చి జాబ్ క్యాలండర్ ప్రకటిస్తామని నిరుద్యోగులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే కాంగ్రెస్ హామీలు ఆసరా ఫించన్,కళ్యాణ లక్ష్మితో పాటు తొలం బంగారం,మహిళలకు 2500 మొదలగు హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్,మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,నాగన్న యాదవ్, ఉంగ్లమ్. తిరుమల్, జాత్రునాయక్ ,దేవర్ల.నరసింహ, హుస్సేన్,ప్యాటా. తిరుపతయ్య,చిలుక. సత్యం, మహేశ్వర్ రెడ్డి,సయ్యద్. జమేల్,శాంతన్న సాగర్, చీర్ల. శ్రీనివాసులు, జానంపేట. శ్రీను, సూర్యవంశపు. గిరి, ముదిరాజ్, చిట్యాల. రాము, వహీద్, బాలకృష్ణ, వజ్రాల. రమేష్,కవితా నాయక్, బెంగాలీ. రఘు,ఖాదర్భా, అయ్యూబ్, తోట. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పని ఖతం!!

### బయటపడ్డ మంత్రుల మంత్రాలు!!
### దగా కోరు మాటలు ఇక చెల్లవు!!
### పూటకో మాట రైతు భరోసా కు మంగళం!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో అష్టకష్టాల మీద తప్పుడు మాటలు దగా కోరు విధానాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇందిరాగాంధీ, పేర్లు చెప్పి ప్రమాణాలు చేసి 64 సీట్లతో గుడ్డిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఎప్పుడు ఎప్పుడు ఎక్కడెక్కడ ఎన్ని హామీలు ఇచ్చిందో తెలంగాణ ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు, పది సంవత్సరాలపాటు ప్రజల్లో వ్యతిరేకత లేకుండా ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ పార్టీని ఓడించడానికి కాంగ్రెస్ దొంగ మాటలు మాయ మాటలు చేతగాని హామీలు ఇచ్చి దొడ్డి దారిన అధికారంలోకి వచ్చిందని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు, సంవత్సర కాలం పూర్తికాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు పూర్తి వ్యతిరేకత వచ్చింది, కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మూడు లక్షల కోట్ల రూపాయల నిధులు కావాలి కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడింది, ఇప్పటివరకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయకపోవడం ముఖ్యంగా గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో ఎకరాకు 7500 రూపాయలు రైతు భరోసా కింద చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట మార్చి కేవలం పాత పద్ధతిలో ఐదువేల రూపాయలు మాత్రమే జమ చేసింది, అది కూడా అష్ట కష్టాల మీద రైతుల సీజన్ పూర్తయిన తర్వాత చెల్లించింది, ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ తో పాటు యాసంగి సీజన్ రెండు కూడా పూర్తి కావస్తున్నప్పటికీ రైతు భరోసానిధులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిన్న కాక మొన్న రెండు మూడు రోజుల వ్యవధిలోనే లక్ష



తప్పుడు మాటలు మాట్లాడడం సిగ్గుచేటని ప్రజలు అంటున్నారు, మళ్లీ అదే వ్యవసాయ శాఖ మంత్రి రైతు భరోసా నిధులు ఖరీఫ్ సీజన్ డబ్బులు ఇవ్వలేకపోతున్నామని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ నీతిమాలిన పరిపాలనకు నిదర్శనం రాష్ట్ర మంత్రులు పూటకు ఒక మాట మాట్లాడుతూ ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారని దీనికి సమాధానం చెప్పాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, తెలంగాణ ప్రజలు తెలివిగల వ్యక్తులను సంగతి కాంగ్రెస్ పార్టీ గుర్తుపెట్టుకోలేకపోతుందని ఎప్పుడు ఈ ప్రభుత్వం కుప్పకూలిపోతుందో తెలవని పరిస్థితి నెలకొన్నది గ్రామాలలో రచ్చ కట్టల దగ్గర గ్రామ పంచాయతీల దగ్గర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారు, ఒకసారి ప్రభుత్వం ప్రజల్లో ఏ విధమైన వ్యతిరేకత ఉందో ఎందుకు గమనించలేకపోతుందో అర్థం కావడం లేదు రైతు భరోసానిధులు డిసెంబర్ 9 తారీకు లోపు సోనియాగాంధీ జన్మదినం పేరుతో గత సంవత్సరం కూడా సోనియా గాంధీ జన్మదిన రోజు అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు, ఇప్పుడు మాత్రం రాష్ట్ర మంత్రి భరోసాగు క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టు రాలేదని డొంకతిరుడు మాటలు చెప్పడం ఎంతవరకు భావ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మాటకు విలువ లేకుండా మాట్లాడుతారని ప్రజలు అంటున్నారు, రైతు భరోసాతో పాటు రెండు లక్షల రూపాయల పంట రుణమాఫీ విషయంలో రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న డబ్బులు రైతులు ముందుగా బ్యాంకులకు చెల్లించాలని ఈ ప్రభుత్వం చెప్పడం పట్ల రైతులు రగిలిపోతూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు, అంతేకాక ఇప్పటివరకు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకటి కూడా అమలు కాలేదు, విద్యార్థులకు ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించకపోవడం వల్ల కళాశాలను మూతపడి విద్యార్థులు రోడ్లపై తిరుగుతున్నారు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే కాక మళ్ళీ కొత్త పాట పాడుతున్నారు, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేయడానికి ప్రభుత్వం మరో కుట్రకు తెర లేపింది, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటివరకు సిబ్బందిని నియమించని ప్రభుత్వం ఇంటి నిర్మాణం ఏ విధంగా చేస్తుందని ఒకవేళ లబ్ధిదారులు పొరపాటున ఇల్లు నిర్మించుకుంటే అప్పుల పాలు కాక తప్పదని పలువురు మేధావులు సూచిస్తున్నారు, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా ఇంద్రమ్మ లభించాలని కూడా మళ్లీ మోసం చేయడానికి కుట్ర చేస్తుందని పలువు అంటున్నారు, ఇప్పటివరకు ఇచ్చిన హామీలకు గతి లేదు కానీ ఇందిరమ్మ గృహ నిర్మాణానికి ఏ విధంగా నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని వెంటనే ప్రభుత్వం తప్పుడు మాటలు మాయ మాటలు మానుకోవాలని ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ తో పాటు రైతు భరోసా కింద ఖరీఫ్ సీజన్ యాసంగి సీజన్ రెండు పంటలకు సంబంధించి వెంటనే నిధులు విడుదల చేయకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తో పాటు మంత్రులు ఎమ్మెల్యేలు ఎక్కడ తిరగకుండా ఈ



రాష్ట్ర ప్రజలు అడ్డుకునే ప్రమాదం దాపురించింది, ఈ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు టిఆర్ఎస్ ,బిజెపి పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల పైన ప్రజలను మోసం చేస్తున్న అనేక విషయాల పైన ప్రజల ముందుకు వెళ్లాలని ప్రజలను జాగ్రత్త చేయాలని పలువు కోరుతున్నారు, అంతేకాక మహాలక్ష్మి పథకం మాయమైపోయింది, గ్యాస్ సిలిండర్ గడ్డిలో కలిసింది, ఆసరా పెన్షన్లు అసలే లేవు, వీటితోపాటు ఎస్సీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, యువ వికాసం ఎక్కడ ఉందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ప్రతి విషయం పైన ప్రభుత్వం సమాలోచన చేసి నిధులు లేకపోతే ఎందుకు తప్పుడు మాటలు తప్పుడు హామీలు ఇవ్వాల్సి వచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు, మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం దగ్గర పడిందని ప్రభుత్వం ఏ క్షణంలో అయినా కుప్పకూలే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు, ఈ రాష్ట్రంలోని మంత్రులు, వ్యవసాయ శాఖ ,రెవెన్యూ శాఖ, ఎక్సైజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, తో పాటు ఇతర మంత్రులు కూడా ఎప్పుడు ఏమి మాట్లాడింది ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్న సంగతి మంత్రులు ఎందుకు గమనించలేకపోతున్నారో ఒకసారి ఆలోచించుకోవాలని ప్రజలు కోరుతున్నారు, వెంటనే ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజాక్షేత్రంలోకి రావాలని ప్రజలు పిలుపునిస్తున్నారు,

# హైకోర్టు తీర్పును అమలు చేయాలి

**కోయగూడెం ఓసి 2 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి.**

**కేవోసి లో భారీ ర్యాలీ, ప్రాజెక్ట్ ఆఫీస్ ముందు ధర్నా.**




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): శనివారం హైకోర్టు తీర్పు అమలు చేసి కోయగూడెం ఓసి 2 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు, శనివారం నాడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం,భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు కోయగూడెం ఓసి లో భారీ ర్యాలీ నిర్వహించి, కేవోసీ ప్రాజెక్టు అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు, అనంతరం పీవోకు వినతి పత్రం అందజేశారు, ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పు అమలు జరిపి కోయగూడెం ఓసి 2 ఫిట్ 1,2,3 లలో సాగు భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితుల భూమి నష్టపరిహారం,సాగు భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా జరిపిన భూసేకరణ వల్ల వందలాది మంది గిరిజనులు నష్టపోయారని అన్నారు గత పదహారు సంవత్సరాలుగా చేస్తున్న న్యాయ పోరాటం లో కిష్టారం , లచ్చగూడెం,కోయగూడెం, దంతెలతండ, కొత్తతండ, జేత్యతండ గిరిజన నిర్వాసితులే గెలిచారని , వెంటనే నష్టపరిహారం, పునరావాసం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, రెవెన్యూ, సింగరేణి అధికారులు సమస్య పరిష్కారం చేయకపోతే పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ కోటేశ్వరరావు, సమ్మయ్య,చుక్కమ్మ,బోడ క్రిష్ణ,బానోత్ రామా,కోరం సుభాష్ చంద్రబోస్,తదితరులు పాల్గొన్నారు.




## భూ నిర్వాసితులకు హైకోర్టు తీర్పును అమలు చేయాలి

**టేకులపల్లి జేఏసీ డిమాండ్.**



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): కోయగూడెం 3 భూ నిర్వాసితులకు హైకోర్టు ఇచ్చిన తీర్పును సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని టేకులపల్లి రాజకీయ కార్మిక ప్రజా సంఘాల జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్ రావు, కల్తీ వెంకటేశ్వర్లు, భూక్య దల్ సింగ్, ధర్మపురి వీర బ్రహ్మచారి, డిమాండ్ చేశారు. శనివారం టేకులపల్లి లో జరిగిన జెఎసి సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆదివాసి, బంజారా ఇతర నిరుపేద కుటుంబాలకు చెందిన భూమిని సింగరేణి యాజమాన్యం స్వాధీనం చేసుకుని వారికి ఎలాంటి నష్టపరహారం ఇవ్వకుండా కోట్లాది రూపాయలను లాభం పొందుతున్న దని వారు అన్నారు. కష్టజీవులైన ఆదివాసీలకు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తక్షణమే సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని లేని ఎడల టేకులపల్లి జేఏసీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు సింగరేణి యాజమాన్యానికి తెలియజేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు డి ప్రసాద్, జరుపల సుందర్, ఏఐకేఎంఎస్ నాయకులు గుగులోతు రామచందర్, బిఆర్ఎస్ నాయకులు చీమల సత్యనారాయణ, బొమ్మెర్ల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంభ సభ్యులను పరామర్శించిన పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు



పోలవరం(గౌతమ్ న్యూస్): ఈరోజు వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు గారి కుటుంభ సభ్యులను మరియు మామిళ్ల కామేశ్వరరావు గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు గారు.. కుక్కునూరు మండలం వింజరం పంచాయితీ సర్పంచ్ జగిడి బాలరాజు గారు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో స్వర్గస్తులయ్యారు, ఈరోజు వారి కుటుంభ సభ్యులను పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు గారు పరామర్శించి దైర్యం చెప్పారు.. అనతరం జగిడి బాలరాజు గారి చిత్రపటాని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు గారు మాట్లాడుతూ జగిడి బాలరాజు లాంటి నిబద్దత గల నాయకున్ని కోల్పోవటం చాలా బాధాకరం అని, అతని మీద ఉన్న మంచితనంతో 2పర్యాయాలు సర్పంచ్ గా వింజరం ప్రజలు గెలిపించారు అని అయన లేని లోటు పార్టీకి తీరని నష్టం అని అయన అన్నారు.. జగిడి బాలరాజు లాంటి నిబద్దత గల నాయకుడు మళ్ళి పార్టీకి దొరకడు అని, అయన మీద ఉన్న మంచితననికి వీడ్కోలు రోజు వచ్చిన ప్రజలే దానికి నిదర్శనం అని బాలరాజు గారు అన్నారు, జగిడి బాలరాజు గారి కుటుంభ సభ్యులను, కామేశ్వరరావు గారి సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది అని, వారిని పార్టీ గుండెల్లో పెట్టుకుంటుంది అని చూసించారు, చిన్న కష్టం వచ్చిన నేరుగా నన్ను సంప్రదించవచ్చు అని, నేను కూడా వారికీ ఎల్లవేళల అండగా ఉంటాను అని తెలియచేసారు.. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ.1 తాండ్ర రాజేష్, మాదిరాజువెంకన్నబాబు, మల్లేలా చంటి నాయుడు, కొల్లపూడి వసంత్, చిలకల రమేష్ , నకిరికంటి నరసింహారావు, అయిత కోటేశ్వరరావు, అనుమల్ల సత్యనారాయణ, సాయిలి యేసు, మాగంటి శ్రీనివరావు, బరపటి వేంకటేశ్వర్లు, గంజి శ్రీను, గంధం సుమంత్, భాసిబోయిన సంతోష్, కడియం దుర్గారావు, జడ్డి ముత్యాలు, పాముల లక్ష్మణరావు, మారపక రాము, షేక్ అమీర్ పాషా తదితరులు పాల్గొన్నారు...



## కొత్తగూడెం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా కమిటీ )సమావేశంలో పాల్గొన్న

**పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా యంత్రాంగం.**




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం కలెక్టరేట్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ కమిటీ) సమావేశం భద్రాద్రి కొత్తగూడెం ఐ టి ఓ సి కార్యాలయం మీటింగ్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో (దిశా) చైర్మన్ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీ. జితేష్ వి. పాటిల్ , అయితే డిఎపిఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు ,పాయం వెంకటేశ్వర్లు ,మాలోత్ రాందాస్ ,జారే ఆదినారాయణ, దిశ కమిటీ సభ్యులు మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని అభివృద్ధి పథకాల పై అధికారులతో సమీక్ష జరుపుతున్నారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి డైరక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ అండ్ పా జి వెంకటేశ్వర రెడ్డి తో

## ఆస్ట్రేలియా మైనింగ్ టెక్నాలజీ కంపనీల సభ్యుల భేటీ.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయము నందు బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయంలో ఆస్ట్రేలియా దేశ న్యూ సౌత్ వేల్స్ రాష్ట్ర మైనింగ్ టెక్నాలజీ కంపనీల సభ్యుల బృందం సంస్థ డైరక్టర్ పి అండ్ పి, అండ్ పా జి.వేంకటేశ్వర రెడ్డి మరియు సంబంధిత జనరల్ మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముందుగా జిఎం(సిపిపి) ఏ.మనోహర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఆవిర్భావం, ఏరియాల వారీగా ఉన్న ఉపరితల మరియు భూగర్భ గనుల గురించి, ప్రస్తుతం సింగరేణిలో ఉపయోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, సంస్థ వృద్ధి రేటును వివరించారు. డైరక్టర్ పి అండ్ పి,అండ్ పా జి.వేంకటేశ్వర రెడ్డి బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగుపెట్టిందని వివరించారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోని అవకాశాలను పూర్తిగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్ట్రేలియా దేశ న్యూ సౌత్ వేల్స్ రాష్ట్ర మైనింగ్ టెక్నాలజీ కంపనీల బృందం సభ్యులు తమ తమ కంపనీల మైనింగ్, రక్షణ, సాంకేతిక టెక్నాలజీ మరియు యంత్రాల గురించి మరియు బొగ్గు ఉత్పత్తి లో వాటి పని తీరు గురించి వివరించారు. ఈ




సమావేశం లో డైరక్టర్ పి అండ్ పి ,అండ్ పా జి.వేంకటేశ్వర రెడ్డి, జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(ఈ-ఎం) ఓసిపి డివిఎస్ సూర్యనారాయణ రాజు, జిఎం(ప్రాజెక్ట్ ప్లానింగ్) కే.సాయి బాబు, జిఎం(ఈ-ఎం) యూజి మైన్స్ వై.రఘు రామి రెడ్డి, జిఎం(ఐటి) రామ్ కుమార్ రావు, ఆస్ట్రేలియా బృందం సభ్యులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ


**ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు రఘురాంరెడ్డి, బలరాం నాయక్.**

భద్రాద్రి కొత్తగూడెం ఆర్సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేసిన ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి మరియు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్,అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆది నారాయణ మరియు భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తో కలిసి పంపిణీ చేశారు. శనివారం ఇల్లందు క్రాస్ రోడ్ లోగల సింగరేణి గెస్ట్ హౌస్ లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గౌడ్ అన్నలకు రక్షణ కవచాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటు రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాల కిట్లు గౌడ్ అన్నలకు ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. గౌడ్ అన్నలు తమ వృత్తిలో భాగంగా తాటి చెట్లు ఎక్కుతున్న క్రమంలో ఆకస్మికంగా జరిగే ప్రమాదాల వలన చాలామంది మరణానికి, శాశ్వత అంగవైకల్యానికి గురి అవుతున్న క్రమంలో వాటిని అరికట్టడానికి ప్రభుత్వం గౌడ్ అన్నల భద్రత కోసం ప్రత్యేక దృష్టి సాధించి వారికోసం ప్రత్యేకంగా ఒక కిట్ తయారు చేయించి దానిని గౌడ్ అన్నల కులదైవం అయినటువంటి కాటమయ్య పేరు పెట్టి కాటమయ్య రక్షగా ఒక పథకం ద్వారా అందరికీ ఆ కిట్లను అందజేస్తుందన్నారు. దీనిలో భాగంగా గీత కార్మికులకు దశలవారుగా శిక్షణ ఇచ్చి, అందరికీ అందే విధంగా ప్రభుత్వం ఈ



పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూరక్షక కవచం కిట్ల వల్ల కల్లు గీత కార్మికులు చెట్లపైకి వెళ్లినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని, వీటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, దీనిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కల్లుగీత కార్మిక సొసైటీ పరిధిలోని చెట్లపైకి ఎక్కే గీత కార్మికులందరినీ గుర్తించి వారికి రక్షక కవచ కిట్లను అందజేస్తామని తెలిపారు. కాటమయ్య రక్షక కవచం కిట్లను అందజేసిన గీత కార్మికులు వాటిని వినియోగిస్తున్నారా లేదా చూడాలని, ఈ కిట్ల వినియోగం వల్ల కలిగే లాభాలను ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలు కంపెనీ కార్యక్రమం చేపట్టడంచాలా సంతోషం కరమని అన్నారు.జిల్లా లో ని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలా ఖమ్మం, భద్రాచలం పరిధిలో ఈరోజు 83 మందికి కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ చేపడుతున్నామన్నారు. గీత కార్మికులకు రక్షణ కోసంకోసం ప్రభుత్వం 12,000 ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇందిర, మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో మార్గదర్శి బిఇడి కళాశాల విద్యార్థుల ప్రభంజనం




మనం కూడా జిల్లా ప్రతినిధి (గౌతమ్ న్యూస్): నెల 15 న ప్రకటించిన డిఎస్సి ఫలితాలలో స్థానిక మహబూబాబాద్ పట్టణంలోని మార్గదర్శి బి.ఇ.డి మరియు డి.ఇ.డి కళాశాలలో చదివిన 59 మంది విద్యార్థులు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్నారు అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో గుగులోత్ మౌనిక (బయోసైన్స్), బత్తుల కృష్ణవేణి (సోషల్), జంగం రేణుక (మాద), ఉడుత వెంకన్న (తెలుగు), చింతల సబిత(తెలుగు) నియామక పత్రాలు పొందారు. అలాగే ఎస్జిటీ విభాగంలో 54 మంది నియామక పత్రాలు పొందారు. వీరంత మహబూబాద్ జిల్లాకే చెందినవారు కావడం గమనర్హం. ఒకసారి ఒకే కాలేజిలో చదివిన 59 మందికి ఉద్యోగాలు రావటం పట్ల కళాశాల కరెస్పాండెంట్ తక్కళ్ళపల్లి రవీందర్ రావు, డైరెక్టర్ సంధ్యారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్ మరియు అధ్యాపకులు బాలాజి, చంద్రశేఖర్, భాస్కర్, హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

## సీఐడీ ఛీఫ్ శిఖాగోయల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్ అండ్ ఆడిషనల్ డిజీ స్వాతి లక్రా చేతుల మీదుగా అవార్డు తీసుకున్న

**మానుకోట బీడీ టీమ్ కే.అంజయ్య**




మానుకోట జిల్లా ప్రతినిధి (గౌతమ్ న్యూస్): అక్టోబర్ 16వ నుండి 19వ 2024 తారీఖున తెలంగాణస్టేట్ పోలీస్ అకాడమీలో జరిగిన తెలంగాణ స్టేట్ మొదటి పోలీస్ డ్యూటీ మీట్ లో భద్రాద్రి జోన్ మహబూబాబాద్ జిల్లా బీడీ టీమ్ లో పనిచేస్తున్నా కే.అంజయ్యకు సీఐడీ ఛీఫ్ శిఖాగోయల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్ అండ్ ఆడిషనల్ డిజీ స్వాతి లక్రా మేడమ్ చేతుల మీదుగా రూమ్ సెర్చ్ గోల్డ్ మెడల్ అందుకోవడం జరిగింది ఎవరైనా విఐపి లు వివిఐపి లు ఒక ప్రదేశానికి వచ్చినప్పుడు వాళ్లు వుండే రూమ్ ని ఎలాంటి అనుమానా స్పద వస్తువులు వుండకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్టం నుండి 7 జోన్లు 5 కమిషనర్ రేట్స్ పాల్గొన్నాయి మనజిల్లాకు గోల్డ్ మెడల్ రావడం జరిగింది. జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్, ఆర్.ఐ అడ్మిన్, డీఎస్పీలు అంజయ్యకు అభినందనలు తెలియజేసారు.

## హైదరాబాద్ లోని ముత్యాలమ్మ ఆలయానికి మహిళ అఘోరి



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): సికింద్రాబాద్ మొండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని కాలితో తన్ని ధ్వంసం చేసిన ఘటన హిందువులకు ఆగ్రహాన్ని తెప్పించిన సంగతి పాఠకులకు తెలిసిందే, కొద్ది రోజుల క్రితం అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి శాంతి పూజలు యాగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసరగుట్టలో మహిళ అఘోరి ప్రత్యక్షమయ్యారు. శ్రీ భవాని శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామికి స్వయంగా తన చేతులతో భస్మాభిషేకం చేశారు. అంతకుముందు విగ్రహ ధ్వంసానికి గురైన సికింద్రా బాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ గుడికి వచ్చిన అఘోరి ప్రత్యేక పూజలు నిర్వహించి, హెూమం చేసి ఆలయ సంప్రోక్షణ చేపట్టారు. ఒంటి కాలిపై నిలబడి పూజలు చేశారు.తనను కలిసిన మీడియా తో మహిళా అఘోరి మాట్లాడుతూ.. తన విశేషాలను వెల్లడించారు. తన స్వస్థలం మంచిర్యాల అని, ఏడేళ్ళ వయసులో తన గురువు అఘోరి దీక్షను ఇవ్వడంతో హిమాల యాలకు వెళ్లిపోయానని, ప్రస్తుతం 27ఏళ్ళని, తాను 18శక్తి పీఠాలు, 12జ్యోతి ర్లింగాలు దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. అఘోరి, నాగసాధు రెండు దీక్షలను తాను పూర్తి చేశానన్నారు.ఏండ్ల తరబడి హిమాలయాల్లో తపస్సులో ఉన్న తమకు అందరి మాదిరిగా చదువుకునే అవకాశం లేదని, అయితే దైవ కృపతో దేశంలోని ప్రముఖ భాషలను అర్థం చేసుకోగలుతానని, మాట్లాడుతానని వెల్లడించారు. గురువు అనుమతితో సనాతన ధర్మ పరిరక్షణకు హిమాలయాల్లోని కేదార నాథ్, కైలాష్ పర్వతాలను వీడి జనసంచారంలోకి వచ్చి ఐదేళ్ళుగా దేశంలో పర్యటిస్తున్నానని తెలిపా రు. మరో 25సంవత్సరాలు మాత్రం తన దేహం భూమి పై ఉంటుందని అప్పటిదాక సనాతన ధర్మ సంరక్షణకు పాటుపడుతానని తెలిపారు. తన స్వస్థలం తెలంగాణలో మంచిర్యాల అని చెప్పు కొచ్చింది, ఈ తెలంగాణలో పర్యటించడం ఆనందంగా ఉందని, శక్తి పీఠాల్లో జోగులాంబ అమ్మవారు ఈ ప్రాంతంలో ఉండటం గొప్ప విషయమన్నారు. తన తదుపరి పర్యటన గుజరాత్ లో కొనసాగు తుందన్నారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ భిక్షాటన

నర్సంపేట(గౌతమ్ న్యూస్): పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ వరంగల్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో బిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. నర్సంపేటలో వినూత్నంగా బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా అంటే గత ప్రభుత్వం ప్రభుత్వం రెండు సంవత్సరాలు ఎటువంటి స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా కాలయాపన చేసి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అదే రీతిలో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు మెంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులి పై చదువులకు దూరం అయ్యే విధంగా చేస్తోంది అని మండి పడ్డారు.పెండింగ్ లో ఉన్న 7500 కోట్ల స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేకుంటే మేము భిక్షాటన చేసి అయినా నిధులు సమకూర్చుతామని అన్నారు.అలాగే విద్యార్థుల తమ చదువులు పూర్తి చేసుకొని పై చదువులు చదువుదాం అంటే ప్రైవేటు పాఠశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం తో ఎందరో విద్యార్థులు పై చదువులకు దూరం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న 7500 కోట్ల స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేయవలసిందిగా కోరారు. లేదంటే ఉద్యమాలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాకం రాకేష్, ఎస్ ఎఫ్ డీ జిల్లా కన్వీనర్ తిప్పారపు గణేష్, కార్యకర్తలు అఖిల్, శ్రీనివాస్, చరణ్, సిద్దు విద్యార్థులు పాల్గొన్నారు.

## అవినీతి అనే పదానికి చోటు లేదు.. పవన్ కీలక వ్యాఖ్యలు

జనసేనలో ఇతర పార్టీల నాయకులు చేరడం వల్ల మాకు విశ్వాసాన్ని మరింత పెంచాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జనసేనలో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని.. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. గుడివాడ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని.. మా దృష్టికి వచ్చింది.. వెంటనే చర్యలు చేపట్టాలని నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా పంచాయతీ శాఖలో అవినీతి అనే పదానికి చోటు లేకుండా తయారు చేస్తామన్నారు. అధికారులు ఎవరికైనా లంచం అని అడిగితే వారిని ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. పల్లె పండు ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడ్డాయని.. గతంలో పంచాయతీ రాజ్ శాఖలో ఎన్నడూ లేని విధంగా పని చేస్తుందని ప్రజలు కూడా పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు

## ఈనెల 23న వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్..

### హాజరుకానున్న రాహుల్, రాబర్ట్ వాద్రా




**న్యూఢిల్లీ,:** కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకాగాంధీ అక్టోబర్ 23న (బుధవారం) వయనాడ్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నవంబర్ 13న లోక్‌సభ ఉప ఎన్నిక జరగనుంది. ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్.. ప్రియాంక పేరును అధికారికంగా ప్రకటించింది. ప్రియాంక వెంట ఆమె భర్త రాబర్ట్ వాద్రా, సోదరుడు రాహుల్ గాంధీ ఉండనున్నారు. పెద్ద ఎత్తున భారీ ర్యాలీగా వెళ్లి ప్రియాంక నామినేషన్ దాఖలు చేయనున్నారు. వాయనాడ్ కలెక్టరేట్‌కు రోడ్‌షో ద్వారా వెళ్లి ప్రియాంక నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి పోటీ చేశారు. రెండు చోట్ల భారీ విజయంతో గెలుపొందారు. దీంతో రాయ్‌బరేలీలో కొనసాగాలని నిర్ణయం తీసుకోవడంతో వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇక్కడ బైపోల్ ఎన్నిక వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. 15 రాష్ట్రాల్లోని 47 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలతో పాటు వాయనాడ్‌కు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. జార?ండ్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా నవంబర్ 13న జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం నవంబర్ 23న విడుదల కానున్నాయి. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానంతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానానికి కూడా ఎన్నికల సంఘం ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. జార?ండ్‌లో రెండు విడతల్లో నవంబర్ 13, 20న ఓటింగ్ జరగనుంది.

## వారికి రైతు భరోసా ఇవ్వలేము.. తుమ్మల సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, :** తెలంగాణ రైతులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతీ సన్న ధాన్యం పండించిన రైతుకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వమని స్పష్టం చేశారు. రూ.25 వేల కోట్ల రూపాయలు గత ప్రభుత్వం పంట వేయని భూములకు ఇచ్చిందన్నారు. రైతు భరోసా 7500 క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ఇస్తామన్నారు. మార్పులకు అనుగుణంగా రైతులను మారుస్తామని క్లారిటీ ఇచ్చారు. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రి రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో 70 వేల కోట్ల రుణమాఫీ చేశారని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామన్నారు. 42 బ్యాంకుల నుంచి వివరాలు తెప్పించుకుని రుణమాఫీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో 42 లక్షల లబ్ధిదారులకు, 25 లక్షల కుటుంబాలకు 31 వేల కోట్లు అవసరం అని.. 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ ఆగస్టు 15ననే చేశామన్నారు. 20 లక్షల మందికి ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉందని తెలిపారు. 2 లక్షల పైన ఉన్న డబ్బులు కడితే రుణమాఫీ అవుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని 3 లక్షల మందికి డిసెంబర్ లో కుటుంబ నిర్ధారణ చేసి వారికి కూడా రుణమాఫీ చేస్తాం. 2500కోట్ల రూపాయలు వేస్తామన్నారు. రుణ విముక్తి కావాలంటే కొత్త రుణాలు రావన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న రుణాల వారి అంశం క్యాబినెట్ లో చర్చిస్తామన్నారు. పంటల భీమా గతంలో లేదు. ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతీ రైతు పంటకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో పండే అన్ని పంటలను ఎంఎస్పీ ప్రకారమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అన్ని పంటలను కేంద్రం కొనుగోలు చేయాలి.. ఇప్పటి వరకు 20% కేంద్రం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

## ఇండియన్ సినిమాలంటే చాలా ఇష్టం..



ప్రధాని మోడీని ఈనెల 22, 23 తేదీల్లో రష్యాలోని కజాన్ వేదికగా జరిగే 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనాలని ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానించారు. దీంతో నరేంద్ర మోడీ.. రష్యా పర్యటనకు మరోసారి వెళ్లబోతున్నారు. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ మీడియాతో మాట్లాడుతూ.. ఇండియన్ సినిమాలు, బాలీవుడ్‌పై ప్రసంశల వర్షం గుప్పించారు. భారతీయ సినిమాలకు తమ దేశంలో అత్యంత ప్రజాదరణ ఉందని చెప్పుకొచ్చారు. బ్రిక్స్ సభ్య దేశాలలో సినిమా షూటింగ్‌లకు రష్యా ప్రోత్సాహకాలు అందిస్తుందా? అని మీడియా అడిగిన క్వశ్చన్ కు.. పుతిన్ స్పందిస్తూ.. బ్రిక్స్ సభ్య దేశాలను పరిశీలిస్తే.. రష్యాలో భారతీయ చలన చిత్రాలకు ఎక్కువ ప్రజాదరణ ఉందని అనుకుంటున్నాను.. మాకు ప్రత్యేకంగా టీవీ ఛానెలే ఉంది. భారతీయ చలన చిత్రాలపై చాలా ఆసక్తి ఉంది.. ఈ ఏడాది మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం సందర్భంగా బ్రిక్స్ దేశాల్లోని సినిమాలను పరిచయం చేస్తామని వ్లాదిమీర్ పుతిన్ వెల్లడించారు. ఇక, నేను భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సమావేశం కావడానికి రెడీగా ఉన్నాను అని పుతిన్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై నా స్నేహితుడు మోడీతో చర్చించాలని చూస్తున్నాను అన్నారు. మా మధ్య 100 శాతం సానుకూల ఒప్పందాలు జరుగుతాయనే నమ్మకం ఉందన్నారు. ఇక, భారతీయ చలనచిత్రాలు మాత్రమే కాకుండా వారి సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే బ్రిక్స్ దేశాలకు చెందిన చైనీస్, ఇథియోపియన్ నటులు కూడా ఉన్నారని చెప్పుకొచ్చారు. అలాగే, మేం థియేట్రికల్ ఫెస్టివల్ నిర్వహించాలని బ్రిక్స్ దేశాలతోనూ చర్చించాం.. సినిమా అకాడమీని కూడా త్వరలో నెలకొల్పామని వ్లాదిమీర్ పుతిన్ చెప్పారు. కాగా, గడిచిన 4 నెలల్లో ప్రధాని మోడీ రష్యా పర్యటనకు వెళ్లడం ఇది సెకండ్ టైం. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగిస్తుండగా.. ఈ ఏడాది జులై నెలలో మాస్కోకి మోడీ వెళ్లారు. ఆ సమయంలో 22వ భారత్- రష్యా శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. 2006వ సంవత్సరంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు బ్రిక్ ను స్టార్ట్ చేయగా.. 2010లో సౌతాఫ్రికా చేరిన చేరగా.. అది బ్రిక్స్‌గా మారింది. 2024 జనవరిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ బ్రిక్స్ లో చేరాయి. ప్రస్తుతం ఈ బ్రిక్స్ గ్రూపులో 10 దేశాలు సభ్యత్వం తీసుకున్నాయి.

## మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి



**అమరావతి,:** గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణపనులను తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమైంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఈ రోజు ఆ నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఈ నేపథ్యంలో ఎన్టీవీతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి పొంగూరు నారాయణ.. అమరావతి రాజధాని నిర్మాణం మరో మూడు సంవత్సరాలలో పూర్తి చేస్తామని ప్రకటించారు.. ఇక, సీఆర్డీఏ బిల్డింగ్ అప్పటి మా ప్రభుత్వంలోనే పూర్తి అయ్యిందన్నారు.. ఇంకా, మిగిలి ఉన్న పనులను పూర్తి చేయడానికే ఈ పునః ప్రారంభం అన్నారు.. ఇక, సీఆర్డీఏ పరిధిలో పెట్టుబడులు పెట్టిన వారికి భూములిచ్చాం అన్నారు మంత్రి నారాయణ.. పెట్టుబడులు పెట్టిన వారికి మౌళిక వసతులు అవసరం.. ట్రంక్ రోడ్లు, కాలువలు, నీరు వంటి వసతులు కల్పిస్తాం అని వెల్లడించారు.. అన్ని టెండర్లు నిర్ణీత సమయంలో పూర్తవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.. జనవరి నాటికి టెండర్లు పూర్తి చేసి పనులు జరిపిస్తాం అన్నారు అన్నారు మంత్రి పొంగూరు నారాయణ. కాగా, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని నిర్మాణ పనులు జరగగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. మూడు రాజధానుల స్టాండ్ తో.. అమరావతి నిర్మాణ పనులను పక్కనబెట్టిన విషయం విదితమే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ నిర్మాణ పనులను ఫోకస్ పెట్టింది..

# పరువుచేటు పనులు!



అంతర్జాతీయంగా సంచలనం సృష్టించే హత్యలూ, హత్యాయత్నాలూ ఒక్కోసారి ఉలిక్కిపడేలా చేస్తాయి. వాటి వెనక ప్రభుత్వాల ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు తలెత్తితే అవి మరింత ఆసక్తిని రేకెత్తిస్తాయి. చాలా సందర్భాల్లో అవి దేశాలమధ్య చిచ్చు రేపుతాయి. ఇలాంటి ఆపరేషన్లను గుట్టుచప్పుడు కాకుండా చేయడంలో ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ఆరితేరింది. చేతికి నెత్తురంటకుండా, సాక్ష్యాధారాలేమీ మిగలకుండా ప్రత్యర్థులను మట్టుబెట్టడంలో ఆ సంస్థ తర్వాతే ఎవరినైనా చెప్పుకోవాలి. అలాంటి ఉదంతంలో ఇప్పుడు మన దేశం పేరు వినబడటం ఆశ్చర్య కరమే. అమెరికాలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై హత్యాయత్నం కేసులో అమెరికాలో దాఖలైన తాజా నేరారోపణ పత్రం ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిజానికి ఏడాదికాలంగా ఆ పంచాయతీ నడుస్తోంది. నేరుగా భారత్‌ను నిందించక పోయినా నిరుడు మే నెలలో దాఖలు చేసిన నేరారోపణ పత్రం తమ గడ్డపై తమ పౌరుడిని హత్య చేసేందుకు జరిగిన ప్రయత్నం వెనక 'భారత ప్రభుత్వంలో పనిచేసే ఒక ఉద్యోగి ప్రమేయం ఉన్నద'ంటూ ఆరోపించింది. అప్పట్లో ఆ ఉద్యోగి పేరు వెల్లడించకుండా 'సీసీ 1'గా మాత్రమే ప్రస్తావించింది. కానీ శుక్రవారం అమెరికా న్యాయశాఖ అతని పేరు వికాస్ యాదవ్ అనీ, భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)లో ఇంతక్రితం పనిచేశాడనీ వెల్లడించింది. వికాస్ యాదవ్ ప్రస్తుతం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని నేరారోపణ పత్రం చెప్పటం... భారత ప్రభుత్వం ఈ కేసులో తమకు సహకరిస్తున్నదని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అనటం ఉన్నంతలో ఊరట. తమ దేశంలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉన్నదని ఒకపక్క కెనడా ఆరోపిస్తున్న తరుణంలో అమెరికా సైతం ఇదే తరహా ఆరోపణ చేయటం గమనించదగ్గది. ఎన్నికల్లో సిక్కు ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని కెనడా ప్రధాని ట్రూడో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేసిన మన దేశానికి తాజా పరి ణామం ఇబ్బంది కలిగిస్తుందనటంలో సందేహం లేదు. ఎందుకంటే గురుపత్వంత్‌ను హతమార్చ టానికి ఏమేం చేయాలో నిందితులు చర్చించుకున్న సందర్భంలోనే నిజ్జర్ హత్యను జయప్రదంగా పూర్తిచేయటం గురించిన ప్రస్తావన వచ్చింది. ఇలాంటి వ్యవహారాలు చక్కబెట్టే వారికి వేయి కళ్ళుండాలి. తాము ఎవరిని సంప్రదిస్తున్నామో క్షుణ్ణంగా తెలిసివుండాలి.

కానీ ఆ సమయంలో రా సీనియర్ అధికారిగా ఉన్న వికాస్ యాదవ్ మాదకద్రవ్య ముఠాలతో సంబంధాలుండే నిఖిల్ గుప్తాకు గురుపత్వంత్‌ను అంతంచేసే బాధ్యత అప్పగించటం, గుప్తా దాన్ని కాస్తా కిరాయి హంతకుడనుకున్న మరో వ్యక్తికి ఇవ్వటంతో కథ అడ్డం తిరిగింది. నిఖిల్ గుప్తా చెక్ రిపబ్లిక్‌లో దొరికిపోవటం, అతన్ని ఆ దేశం అమెరికాకు అప్పగించటం పర్యవసానంగా మొత్తం పథకం బట్టబయలైంది. కిరాయి హంతకుడనుకున్న వ్యక్తి కాస్తా అమెరికా మాదకద్రవ్య నిరోధక విభాగం ఏజెంటు. ఆ సంగతి తెలియక హత్య కోసం అతనితో లక్ష డాలర్లకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం, అందులో 15 వేల డాలర్లు చెల్లించటం నిఖిల్ గుప్తాతోపాటు వికాస్ మెడకు చుట్టుకుంది. అది మన దేశ ప్రతిష్ఠకు కూడా మచ్చ తెచ్చింది. వికాస్ సాధారణ అధికారి కాదు. రా సంస్థకు ముందు ఆయన సీఆర్‌పీఎఫ్‌లో పనిచేశాడు. వికాస్‌ను సర్వీసునుంచి తొలగించి అతనికోసం గాలిస్తున్నామని మన ప్రభుత్వం ఇచ్చిన వివరణకు అమెరికా సంతృప్తి చెందింది. 'రా'లో ఉన్నతాధికారులకు చెప్పకుండా వికాస్ యాదవ్ ఇలాంటి పెడధోరణులకు పాల్పడ్డాడని మన ప్రభుత్వం చెబుతోంది. విదేశాల్లో గూఢచర్యం ఆషామాషీ కాదు. అలాంటి పనిలో నిమగ్నమైవుండేవారు ఉన్నతాధి కారులకు తమ కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు వర్తమానం అందిస్తే వేరే విషయం. చెప్పినా చెప్ప కున్నా అంతా సవ్యంగా జరిగితే రివార్డులు దక్కవచ్చేమో. కానీ వికటిస్తే ఆ అధికారితోపాటు దేశం పరువు కూడా పోతుంది. గురుపత్వంత్ ఖలిస్తాన్ వేర్పాటువాదే కావొచ్చు. ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తే అయివుండొచ్చు. మన దేశంలో కేసులుంటే తమకు అప్పగించాలని అమె రికాను కోరాలి. ఆ దేశ పౌరుడిగా అక్కడే స్థిరపడిన వ్యక్తిపై అంతకుమించి ఏదో సాధించాలను కోవటం తెలివితక్కువతనం. అసలు ఒక వ్యక్తిని భౌతికంగా లేకుండా చేసినంత మాత్రాన ఉద్యమం ఆగిపోతుందా? అతని సహచరులు భయకంపితులై ఉద్యమానికి దూరమవుతారా? ఏం సాధిద్దా మని వికాస్ ఇలాంటి పనికి సిద్ధపడ్డాడో తేల్చటం అవసరం. వికాస్ యాదవ్ విషయంలో ఇంత పట్టుదలగా పనిచేస్తున్న అమెరికా చరిత్ర కూడా తక్కువేమీ కాదు. 2003 నాటి రవీందర్ సింగ్ వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. 'రా'లో సంయుక్త కార్య దర్శిగా ఉన్న రవీందర్ అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు డబుల్ ఏజెంటుగా పనిచేసి పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ వగైరా దేశాల్లో రా కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అందజేశాడు. తనసంగతి బయటపడిందని గ్రహించగానే కుటుంబంతో సహా మాయమై అమెరికాలో తేలాడు. వారికి అక్కడ మారు పేర్లతో పాస్‌పోర్టులు కూడా మంజూరయ్యాయి. విచిత్రంగా మన దేశం అతన్ని అప్పగించాలని పట్టుబట్టలేదు. ఉద్యోగంనుంచి తొలగించి అధికార రహస్యాల చట్టం కింద కేసు పెట్టడంతో సరిపెట్టింది. 2016లో ఒక రోడ్డు ప్రమాదంలో రవీందర్ మరణించాడని అంటున్నా దాన్ని ధ్రువీకరించే సమాచారం మన ప్రభుత్వం దగ్గరలేదు. మొత్తానికి గూఢచర్యం వికటిస్తే ఏమవుతుందో వికాస్ యాదవ్ ఉదంతం తెలియజెబుతోంది

# ఆకలిని జయించేదెలా?

### 'చారిత్రక విభాత సంధ్యలమానవ కథ వికాసమెట్టిది? ఏ దేశం ఏ కాలంలో

సాధించినదే పరమార్థం' అంటూ అంతిమంగా 'ఏ వెలుగులకీ ప్రస్థానం' అని ప్రశ్నించాడు శ్రీశ్రీ. ఈ ప్రశ్న దశాబ్దాలు గడిచినా మనల్ని వెంటాడుతూనే ఉన్నది. సమాజం వెలుగులవైపే ప్రయాణిస్తోందా? అని సదా హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తూనే ఉన్నది. ఇప్పుడు ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక నేపథ్యంలో మరోసారి మనలను తట్టిలేపుతున్నది. గురు వారం వెల్లడించిన 'యూఎన్డీపీ' సూచీ ప్రపంచంలో 110కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో ఉన్నారని పేర్కొన్నది. ఇందులో అత్యధికులు మనదేశంలోనే ఉన్నారని కుండబద్దలు కొట్టింది. ప్రస్తుతం ప్రజలు ఏం తినాలో ఏం తినకూడదో కూడా వారే తేల్చిచెపుతూ ఈ దేశ రాజకీయాలను ఎడతెరిపిలేకుండా 'అలరిస్తున్న' సనాతన ధర్మో పాసకుల ప్రవచ నాలను కాసేపు పక్కన పెట్టి ఈ ఐక్యరాజ్య సమితి తాజా సూచీ వెలుగులో ప్రపంచాన్ని ఒక్కసారి తేరిపారచూస్తే అసలు తిండే దొరకని అన్నార్తుల ఆక్రందనలు మనలను కలవరపెడుతాయి. భయంకరమైన సంక్షోభాల ఊబిలో కూరుకుపోతున్న మానవాళి మనల్ని ఆందోళనకు గురిచేస్తుంది. మనుషులు అన్నపానీయాల కోసం అలమటించిన కాలమొకటి గతంలో ఉండేదంటే సరిపెట్టుకోవచ్చు. కానీ నేటి ఆధునికయుగంలో సైతం ఇది కొనసాగుతుండటం సహించలేనిది. ఎందుకంటే.. ప్రపంచంలో ఇప్పటికే ఏటా కొన్ని వేల ట్రిలియన్ డాలర్ల సంపద ఉత్పత్తి అయి చలామణిలో ఉంటోంది. అది ప్రపంచ జనాభా మొత్తం కాలుమీద కాలేసుకుని తిన్నా కొన్ని వందల సంవత్సరాలకు సరిపోతుంది. అసలీ ఉన్న సంపదను వాడుకోకుండానే, అది ఏటా ఉత్పత్తి చేసే అదనపు సంపదే ప్రపంచ




జనాభాకు కడుపునిండా అన్నం పెడుతుంది. అయినా నేడు సగం ప్రపంచం అర్థాకలితో అలమటిస్తోంది. నూటా పదికోట్లమంది దారుణమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఎందుకు? సంపద పంపిణీలో అంతులేని దోపిడీ, ఫలితంగా నెలకొన్న తీవ్రమైన అసమానతలు అనాదిగా వెంటాడుతుండగా.. వాటికి తోడు యుద్ధాల ఫలితంగా తలెత్తే ఆహార సంక్షోభాలు ఈ ఆకలికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో రోజుకు సుమారు ఇరవైయ్యొక్క వేలమంది చొప్పున ఆకలికి తాళలేక ప్రాణాలు కోల్పోతున్నారన్న ఆక్స్ఫామ్ నివేదిక ఇందుకో తిరుగులేని ఉదాహరణ.

నేడు ఇజ్రాయిల్, పాలస్తీనా వైపు చూస్తే ఏం కనిపిస్తోంది? రావణకాష్టంలా మండు తున్న మారణహోమంలో ఆయుధాలకంటే ఆకలికి బలవుతున్న వారే ఎక్కువ. ఇందులో మూడోవంతు మంది ముక్కుపచ్చలారని పసిపిల్లలు, మహిళలే. బాంబుల మోతల్లో అట్టుడికిపోతున్న గాజాలో అయిదు లక్షల మందికి ఆహారం అందడం లేదు. సూడాన్లో అంతర్యుద్ధం కారణంగా తీవ్రమైన ఆకలిచావులు సంభవించే ప్రమా దం పొంచివుందని పలు మానవతావాద సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే అక్కడ సుమారు ఏడున్నర లక్షల మంది ఆహారం కోసం అల్లాడుతున్నారు. ఇక ఉక్రెయిన్లో జరుగుతున్నదేమిటి? యుద్ధంలో అటూ ఇటూ మాటిమాటికీ చేతులు మారుతున్న ఆధిపత్యంలో ప్రతి ఊరూ, ప్రతి నగరం నేలమట్టమయ్యాకే వీరికైనా, వారికైనా స్వాధీనం అవుతోంది. వైరిపక్షాలు ఆహారాన్నీ, తాగునీటినీ, ఇంధనాన్నీ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఫలితంగా బాధిత ప్రజలు ఆకలికి విలవిలలాడు తున్నారు. యుద్ధభూమి నుండి వలసబాటలో సాగుతున్న లక్షలాది ప్రజలు కూడా ఆకలిచావులకే బలవుతున్నారు. ఇది ప్రత్యక్షంగా ఆయా దేశాల ప్రజలనే కాదు.. పరోక్షంగా మొత్తం ప్రపంచ దేశాల ప్రజలనూ ప్రభావితం చేస్తుంది. అందుకే ఇప్పుడు ఆకలి విశ్వమంతటా విలయతాండవం చేస్తున్నది. ఆయుధాలు ఎంత విధ్వంసం సృష్టించగలవో, అవి ఎంత కనికరం లేనివో మనం కండ్లారా చూస్తున్నాం. అంతకుమించి వాటి బేహారులు ఎంతనీచంగా నిప్పు చల్లారకుండా ఎగదోస్తున్నారో కూడా గమనిస్తూనే ఉన్నాం. వీరి నైచ్యానికి పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాల నుంచి పచ్చటి పొలాలు, నదులు, విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమల దాకా సర్వం నేలమట్టం అవుతున్నాయి. ఈ కారణంగా తలెత్తే ఆహార సంక్షోభం రాబోవు తరాలను సైతం ఆకలి కోరలకు బలిచేయనుంది. చివరికి ఇదెక్కడికి దారితీస్తుంది? మానవజాతి మొత్తాన్ని ఈ నేల నుంచి తుడిచి పెట్టేస్తుందా? బతకడానికే పనికిరానిదిగా ఈ భూమండలం రూపురేఖల్ని మార్చేస్తుందా? స్టీఫెన్ హాకింగ్ చెప్పినట్టు కుబేరులంతా కలిసి పచ్చటి భూమిని చెత్తకుండీగా మార్చేసి, గ్రాహాంతరాలకు ఉడాయించేస్తారా? అదే జరిగితే ఈ మానవజాతి సుదీర్ఘ నాగరికతా వికాసం ఏం సాధించినట్టు? 'గతమంతా తడిచె రక్తమున కాకుంటే కన్నీళ్లతో' అన్నాడు శ్రీశ్రీ. కానీ వర్తమానమూ అందుకు భిన్నంగా లేకపోవడం కడు విషాదం. ఇదిలాగే కొనసాగితే.. 2030 నాటికి ఆకలన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని ఈ ప్రపంచం ఎలా సాధించగలదు?

# అప్పులు-ప్రయివేటీకరణ



అప్పులు మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి. రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. పాత అప్పులకు కిస్తీల కోసమే మళ్లీ రుణాలు తెస్తున్నామంటూ అధికార కాంగ్రెస్ అంటుండగా, రూ. వేల కోట్లు అప్పులు తెచ్చి ఒక్క పథకాన్ని సరిగ్గా అమలు చేయట్లేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు నిధులలేమీ పేరుతో పథకాలు, ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించే ప్రణాళికలు చేస్తున్నదా? అనే ప్రశ్న సహేతుకమే. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టు పైసల్లేవని చెప్పి ఇచ్చిన రాజకీయ హామీలను తుంగలో తొక్కిన చరిత్ర బీఆర్ఎస్ది. ప్రజల్ని విశ్వాసంలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహారాలు చేస్తే ఎవరూ ఊరుకోరు. బిల్లులు చెల్లించాలంటూ వర్కింగ్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు, సర్పంచులు రెండేండ్లుగా ఎదురు చూస్తున్న మాట పచ్చినిజమే కదా? బీఆర్ఎస్ కాలం నుంచే పెండింగ్ బిల్లులు సమస్య ఉంది. అది నేటికీ కొనసాగుతోంది. చివరకు చోటామోటా కాంట్రాక్టర్లు, సర్పంచుల, ఎంపీటీసీలు చేసిన పనులకూ నిధుల కొరత తప్పడం లేదు. మూడేండ్ల కింద సర్పంచుల కుటుంబాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాయి. ఒక సర్పంచ్ అసువులు బాశాడు కూడా. బడా కాంట్రాక్టర్లకు వెండిపళ్లెంలో పెట్టి బిల్లులు విడుదల చేసే ప్రభుత్వాలు, గ్రామాభివృద్ధి కోసం ఇంట్లో భార్యల పుస్తెలు తాకట్టుపెట్టి, అప్పులుచేసి పనులు చేసినవారికి నిధుల లేమిని అడ్డంకిగా చూపడం అన్యాయం. ఈ దుర్భర పరిస్థితిని కేంద్రం చోద్యం చూస్తున్నది. సమాఖ్యతత్వాన్ని మరిచి రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు పూర్తిగా ఇవ్వకపోవడం, ఇచ్చినా అరకొరగానే విదల్చడం రొటీన్ అయి పోయింది. మోడీ సర్కార్ నుంచి రావాల్సిన సాధారణ నిధులూ తెలంగాణకు మృగ్యమవుతున్నాయి. హక్కుగా ఇవ్వాల్సిన పైసలను సైతం పెద్దన్న పట్టించుకోకపోవడం ప్రజల జీవన హక్కును కాల రాయ డమే. ప్రస్తుతం రాష్ట్రం అప్పుల ఊబిలో ఉంది. కొత్త సర్కారు బాధ్యతలు చేపట్టిన తర్వాత మరో రూ. 49,618 కోట్ల అప్పు తీసుకుంది. మూల ధనం కింద రూ.21,881 కోట్లు ఖర్చు చేసింది. రుణమాఫీ, రైతుభరోసా, చేయూత, విద్యుత్, బియ్యం, గ్యాస్ రాయితీలు, మహలక్ష్మి, గృహజ్యోతి స్కాలర్‌షిప్లు, ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాల కోసం రూ.54,348 కోట్లు వ్యయమైనట్టు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రకటించింది. గత ప్రభుత్వం చేసిన అప్పుల కోసం కిస్తీలు కట్టేందుకు రూ.56,440 కోట్లు వినియోగించినట్టు పేర్కొంది. ఈనేపథ్యంలో కొత్తగా అప్పులు తీసుకుంటున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించే పరిస్థితి లేకుండా పోయిందని తెలియ జేసింది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తారీఖు జీతాలు ఇస్తున్నామని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం రాష్ట్రం తాజా అప్పులు రూ.7 లక్షల కోట్లు. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు రూ.3 లక్షల కోట్లు. బీజేపీ సర్కారు ఈ నిధులివ్వడంలో చేస్తున్న అలవికాని ఆలస్యం మూలంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టబడుతున్నది. నాణానికి ఇదో పార్శ్యం. మరో పార్శ్యం ఏమిటంటే, కాసులు లేవనే పేరుతో ప్రాజెక్టులను, పథకాలను ప్రయివేటు, కార్పొరేట్ల ధారాదత్తం చేసే కుట్ర దాగున్నట్టు కనిపిస్తున్నది! మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తిగా ప్రయివేటుకే ఇచ్చేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. మరో 18నెలల్లో డీపీఆర్ తయారు కానుంది. చివరకు పంచభూతాలకూ వెలకట్టే దారుణ దుస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రపంచ దేశాల్లో సాగుతున్న ప్రత్యేక అధ్యయనాలే నిదర్శనం. నీటికి ఖరీదు కట్టే ప్రయత్నాలూ చోటుచేసుకుంటున్నాయి. 'నీటి సంక్షోభం-ఆర్థిక పరిస్థితిపై ప్రభావం' అనే అంశంపై గ్లోబల్ కమిషన్ ఆన్ ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ అనే సంస్థ చేసిన అధ్యయనమే ఈ సంగతిని తేటతెల్లం చేసింది. ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటం, భూ వినియోగంలో లోపాలు, నీటి యాజమాన్యం సమర్థంగా లేకపోవడంతోపాటు వాతావరణ మార్పులు సమస్యల ను మరింత జటిలం చేస్తున్నట్టుగా అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో 50 శాతానికి పైగా ఆహారోత్పత్తి ప్రమాదంలో పడనుందని తేల్చింది. నీటి వనరుల విస్తీర్ణం తగ్గిన కారణంగా అనేక నగరాల్లో సంక్షోభస్థితి నెలకొన్నదని విశ్లేషించింది. నీటి వినియోగం మరింత సమర్థవంతంగా చేయడానికి వీలుగా తగిన ధర నిర్ణయించాలనే ప్రమాదకరమైన ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. రేటును నిర్ణయిస్తే నీటి వినియోగంలో అనేక మార్పులు వస్తాయని డబ్ల్యూటీవో డైరెక్టర్ అభిప్రాయం. ఆర్థికవ్యవస్థలు కుదేలవుతున్న తరుణంలో ప్రయివేటు, కార్పొరేట్ రంగానికి సమస్త ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే కుయత్నాలు జరుగుతుండటం ఆందోళనాకరం. వీటిని ప్రజాప్రభుత్వాలు అడ్డుకోవాలి. పేదలను నిధులలేమి పేర కష్టాల్లోకి నెట్టకుండా, ఆర్థిక ఆసరాను ఇవ్వడం ప్రాథమిక కర్తవ్యంగా భావించి ఆదుకోవాలి.

## రైల్వేలో సిబ్బంది కొరత.. రిటైర్డ్ ఉద్యోగులకు లక్కీ ఛాన్స్!



**న్యూఢిల్లీ,:** ఇండియన్ రైల్వేలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. చాలా రోజులుగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో కొంది మందితోనే రైల్వేశాఖ నడిపించేస్తోంది. దీంతో ఎంప్లాయిస్ పని భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించేందుకు రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు జోన్లలో 25 వేల ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించింది. అయితే కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా.. రిటైర్డ్ ఉద్యోగులకు ఛాన్స్ ఇచ్చింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని రైల్వే శాఖ తెలిపింది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సూపర్‌వైజర్ల నుంచి ట్రాక్‌మెన్ వరకు పలు ఉద్యోగాలకు రైల్వే నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అయితే 65 ఏళ్ల లోపు వారు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పినట్లు సమాచారం. రెండేళ్ల పదవీకాలానికి గాను వీరిని నియమించుకోనున్నారు. అవసరమైతే పదవీకాలాన్ని పొడిగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులు గత ఐదేళ్ల మెడికల్ ఫిట్‌నెస్‌తో పాటు, పదవీ విరమణకు ముందు ఉద్యోగంలో ఉన్నప్పుడు వారి పనితీరును పరిశీలించి ఈ నియామకాలు చేపట్టనున్నారు. గతంలో విజిలెన్స్, లేదా డిపార్ట్‌మెంట్ చర్యలను ఎదుర్కొన్న వారు దరఖాస్తులకు అనర్హులని తేల్చినట్లు సమాచారం. సిబ్బంది కొరతతో పాటు గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్క వాయవ్య రైల్వే జోన్‌లోనే 10వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. మిగతా జోన్లలోనూ పెద్ద ఎత్తున సిబ్బంది అవసరం ఉందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి.

## ప్రజా క్షేత్రంలో ఏం హామీలు ఇచ్చారో గుర్తు చేసుకోండి

### : రేవంత్‌కు ఈటల సవాల్



నిజామాబాద్: గ్రూప్-1 విషయంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ దుర్మార్గ జీవో ఇచ్చిందని, 29ని సడలించాలని నిరుద్యోగులు ఆందోళన నిర్వహిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగుల ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు దీరి ఏడాది కావస్తోందని.. ఇప్పటి వరకు ఇచ్చినా ఏ హామీ సరిగా అమలు కావడం లేదని మండిపడ్డారు. 'ఏ రైతు అయినా రుణ మాఫీ కాకపోతే రెండు లక్షల రుణం తీసుకోండి రేవంత్ అన్నారు. నేను సీఎం కాగానే మాఫీ చేస్తామని అన్నారు. సూటిగా ఒకటే మాట అడుగుతున్నా. ప్రజా క్షేత్రంలో ఏం హామీలు ఇచ్చారో గుర్తు చేసుకోండి. పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని ప్రజలు భావిస్తున్నారు. పెంచిన పింఛన్లు దేవుడెరుగు.. ఉన్న పింఛన్లు ఎత్తేస్తున్నారు. దేవుళ్ళ మీద ఒట్లు వేశారు. గట్టు మీద పెట్టేశారు. రిటైర్డ్ అయ్యిన ఉద్యోగులకు సెటిల్ మెంట్‌లు చేసే పరిస్థితి లేదు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని రేవంత్ రెడ్డి చెప్పారు. ఉద్యమ కార్యాచరణ ప్రకటించబోతున్నారు.' అని ఈటల పేర్కొన్నారు.


## రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయింది..

### వైఎస్ జగన్ ట్వీట్



**అమరావతి,:** రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయిందనడానికి విజయనగరం జిల్లా గుర్ల మండలంలో ప్రబలిన అతిసార ఘటనలే ప్రత్యక్ష ఉదాహరణ అంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎక్స్(ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు. 11 మంది చనిపోయినా, వందల సంఖ్యలో బాధితులున్నా చంద్రబాబు ప్రభుత్వం నిద్ర వీడడం లేదని విమర్శించారు. సమీపంలోనే ఉన్న విజయనగరం, విశాఖపట్నంల్లో మంచి ఆస్పత్రులు ఉన్నా స్థానిక పాఠశాలలోని బెంచీలమీద చికిత్స అందించడం దారుణమన్నారు. నాణ్యమైన అత్యవసర వైద్యాన్ని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. లిక్కర్, ఇసుక స్కాంల్లో నిండామునిగిపోయిన ప్రభుత్వ పెద్దలు ప్రజల కష్టాలను గాలికొదిలేశారన్నారు. ఇప్పటికే 104, 108 వ్యవస్థలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కూటమి సర్కారు వచ్చాక వీరికి సరిగా జీతాలు కూడా రావడం లేదన్నారు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం అయిపోయిందన్నారు. దాదాపు రూ.1800 కోట్ల బకాయిలు గత మార్చినుంచి పెండింగ్‌లో పెట్టారని జగన్ తెలిపారు. ఆరోగ్య ఆసరాను పూర్తిగా ఎత్తివేశారన్నారు. జీరో వేకెన్సీ పాలసీకి మంగళం పాడారని ఆయన పేర్కొన్నారు. సీహెచ్‌సీల్లో స్పెషలిస్టు డాక్టర్లను తీసివేశారన్నారు. విలేజ్‌క్లినిక్స్, పీహెచ్‌సీలను నిర్వీర్యం చేశారని విమర్శలు గుప్పించారు. ఫ్యామిలీ డాక్టర్ ఊసేలేదన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో నాడు-నేడు పనులు నిలిచిపోయాయన్నారు. కొత్త మెడికల్ కాలేజీలను అస్తవ్యస్తం చేశారన్నారు. స్కాంలు చేస్తూ అమ్మడానికి సిద్ధమవుతున్నారని వైఎస్ జగన్ అన్నారు. తనవారికి కట్టబెట్టేందుకు చంద్రబాబు వాటిని ప్రయివేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పులు ప్రజల ప్రాణాలమీదకు వస్తున్నాయని.. ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. డయేరియా బాధిత గ్రామాల్లో మంచి వైద్యం, తాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## హైదరాబాదులో డబ్బులు ఖర్చు పెట్టలేదు.. సంపద సృష్టించాను



**అమరావతి,:** గడిచిన ప్రభుత్వం అమరావతి రైతాంగాన్ని బాధపెట్టారు. రైతు మహిళలు వీరోచితంగా పోరాడారు ఇక్కడ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. 16% లోటు బడ్జెట్ తో ఆ రోజు పాలన ప్రారంభించాం. సైబరాబాద్ ఆనాడు ప్రభుత్వ భూములలో నిర్మించినది. 8 వరసల రోడ్డును సైబరాబాద్ వద్ద మంచి రోడ్డు రూపకల్పన చేసాం అప్పట్లో. ఏం చేసినా విధ్వంసం చేయడం అలవాటైపోయి ఇష్టానుసారంగా మాట్లాడే పరిస్థితులు. సెంటిమెంట్ లు ఎన్నున్న రాష్ట్ర భవిష్యత్తు కోసం భూమి ఇచ్చారు. 54 వేల ఎకరాలు అమరావతి కోసం సేకరించాం. ఎంతమంది రాక్షస మూకలు వచ్చిన ఈ అమరావతిని బ్రతికించిన ఘనత ఇక్కడి రైతాంగానిది. కొంత రాజీ పడి పనులు పునః ప్రారంభించాం. అమరావతికి ఒకవైపు 12, మరోవైపు 12 పార్లమెంటు నియోకవర్గాలు ఉంటాయి. విశాఖను ఆర్థిక రాజధానిని చేస్తాం%ా% కర్నూలులో హైకోర్టు బెంచ్ పెట్టి అభివృద్ధి చేస్తాం. జరీబు భూములకు 50 వేలుతో మొదలెట్టి 10% పెంచుతాం అని చెప్పాం. త్వరలోనే 225 కోట్లు జరీబు భూములకు నిధులు విడుదల చేస్తాం. నేను హైదరాబాదులో డబ్బులు ఖర్చు పెట్టలేదు.. సంపద సృష్టించాను. 30 వేల కోట్లు రాష్ట్రానికి ఆదాయం వస్తుందని చెప్పాను. సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్, ఉపాధికి ఒక కేంద్రం. ఏకంగా ఒకాయన ఎడారి అంటాడు.. స్మశానం అంటాడు. హైదరాబాదులో ఆయన కట్టుకున్న కొంప దగ్గరే నీళ్ళు వచ్చాయి. ఎవరూ చెడిపోవాలని కోరుకోకూడదు అని చంద్రబాబు పేర్కొన్నారు.

# మహిళలు, పిల్లలపై అత్యాచారాలు అడ్డుకోవాలి



'బేటీ బచావో' అనే నినాదాన్ని అపహాస్యం చేసేలా దేశంలో మహిళలు, బాలికల మీద అత్యాచారాలు, హత్యలు వేగంగా పెరిగి పోతున్నాయి. చాలా సందర్భాల్లో బాధితులు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారినే వేధించడం, బలాత్కరించటం, హత్య చేయడం కూడా జరుగుతున్నది.

### బిజెపి పాలిత రాష్ట్రాలలోనే అధికం

భారత దేశంలో ఇప్పుడు రోజుకు 86 అత్యాచారాలు, గంటకు 49కి పైగా నేరాలు జరుగుతున్నాయి. ఇవి ప్రధానంగా బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. టి.ఎం.సి పాలనలోని బెంగాల్‌లో కూడా మహిళల పైన, పిల్లలపైన భయంకరమైన అత్యాచారాలు సంభవించాయి. కర్ణాటకలో బిజెపి కూటమికి చెందిన బలమైన ఒక రాజకీయ పార్టీ ఎంపీ (తర్వాత లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయాడు) వందలాది మంది మహిళల పైన అత్యాచారాలు చేయడమే కాక వాటిని చిత్రీకరించి వేధిస్తున్నట్లు బయటపడింది. బలైన వారిలో అనేకమంది ఆయన పార్టీకి చెందిన వారే.

### బెంగాల్‌లో వెల్లువెత్తిన నిరసనలు

ఇలాంటి ఘటనలపైన అక్కడక్కడ నిరసనలు కొనసాగుతున్నాయి కానీ వాటి ప్రభావం పెద్దగా వుండటం లేదు. పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అమానుష అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసన ఉద్యమం ఒక్కటే ఇందుకు మినహాయింపుగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రారంభించిన నిరసనకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వేలాది మంది స్త్రీ,పురుషుల మద్దతు లభించింది. దారుణాన్ని అడ్డుకోవడంలోనూ విఫలమవటమే కాక తర్వాత నేరస్తులను కాపాడడానికి కూడా సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వ పాత్రను ఈ నిరసన ఉద్యమం ఎండగట్టింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజ్వరిల్లిన ఈ మహా నిరసన నుంచి మన కామ్రేడ్లు నేర్చుకోదగిన అనేక పాఠాలు ఉన్నాయి. అన్ని చోట్లా కూడా కొన్ని ఉమ్మడి అంశాలు కనిపిస్తాయి. అత్యధిక చోట్ల ఇలాంటి ఘటనలలో పోలీసులు చేయవలసింది చేయకపోగా బాధితురాలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదులను పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. దాంతో దుండగులు మరింత చెలరేగిపోయి వేధింపులకు దిగడం అత్యాచారాలకు తెగబడడం కూడా జరుగుతున్నది.

### నేరస్థులకు పోలీసులు, ప్రభుత్వ అండ

ఇలాంటి సందర్భాల్లో మరో ఉమ్మడి లక్షణం ఏమంటే నేరస్థులు పాలక పార్టీకి చెందిన వారైతే రక్షణ కల్పించడం, చర్య తీసుకోకుండా వదిలివేయటం జరుగుతుంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇది సర్వసాధారణ వ్యవహారంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బిజెపి ఎమ్మెల్యేని అరెస్ట్ చేయడానికి హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడిన బిజెపి మీడియా సెల్ ప్రతినిధులు ముగ్గురిని విద్యార్థుల ఆందోళన తర్వాతే అరెస్ట్ చేశారు. అయితే వారిని కొద్ది మాసాల తర్వాత మళ్లీ వదిలిపెట్టారు. మరోవైపున నిరసన తెలిపిన ఆ విద్యార్థులను మటుకు బహిష్కరించి చదువుకునే అవకాశం లేకుండా చేశారు. బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం సిగ్గు మాలిన పాత్ర వల్ల నిందితులకు పదేపదే బెయిల్ ఇప్పించడమే కాక శిక్ష నుండి మినహాయింపు కల్పించి విడుదల చేయటం చూశాం. అనేకమంది అమ్మాయిలపై అత్యాచారానికి, హత్యలకు పాల్పడిన బాబా రామ్ రహీంను హర్యానా ప్రభుత్వం పదేపదే బెయిల్‌పై విడుదల చేస్తూ హిందీ రాష్ట్రాల ఎన్నికలలో బిజెపికి ప్రచారం చేసేందుకు ఉపయోగించు కుంటున్నది.

### మీడియాలో అనుచిత ధోరణి

చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలను బయటకి తీసుకు రావడంలో ముఖ్య పాత్ర వహించే మీడియా కూడా తప్పు చేస్తుంటుంది. వీటిని నివేదించే సందర్భంలో లైంగిక దురహంకారం, పురుషాధిక్య ధోరణులు, అవమానకర భాషతో ఈ నేరం జరగడానికి బాధితులే కారణ మనీ అర్థం వచ్చేలా చేస్తుంది. సమాజంలో వ్యక్తులు బాధ్యతాయుత స్థానంలోని ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారుల ప్రకటనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా ఈ పని జరుగుతుంది.

### దేశవ్యాపిత ఉద్యమం

మహిళలు, పిల్లలపై పెరుగుతున్న ఈ హింసకుగల కారణాలను అరికట్టడం కోసం ఈ అంశంపై ఉద్యమం సాగించాలని సెప్టెంబర్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం దేశ వ్యాపితంగా పార్టీ శాఖలన్నిటికీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జరిగిన అమానుషాలపై కేంద్రీకరించడంతో పాటు బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన, తప్పులకు, పొరబాట్లకు కారణమైన పోలీస్ అధికారులు, ప్రభుత్వ బాధ్యులను శిక్షించడం వంటి డిమాండ్లను కూడా జత చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో కుమ్మక్కై ఉంటే దాన్ని కూడా పూర్తిగా బహిర్గతం చేయాలి. ఈ ఘటనలను మీడియా నివేదించే తీరును నిశితంగా పరిశీలిస్తుండాలి. బతికి బయటపడిన బాధితులకు, బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలి. వారికి న్యాయం జరిగేలా చూసేందుకు కృషి చేయాలి.

# పెనం మీద నుండి పొయ్యిలోకి



ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైన ఔషధాల ధరలు సైతం చుక్కలను దాటి పరుగులు తీస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 800 రకాల ముఖ్యమైన ఔషధాలను ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రతి సంవత్సరం చోటుచేసుకునే సాధారణ పెంపుగానే దీనిని అప్పట్లో సమర్థించుకున్న ప్రభుత్వం తాజాగా ఎనిమిది రకాల ఔషధాల ధరలను ఏకంగా 50 శాతం పెంచడానికి అనుమతించింది. ఉబ్బసం, గ్లకోమా, తలసేమియా, క్షయతో పాటు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడేవారికి అవసరమైన మందులు ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో దిక్కుతోచక సతమతమౌతున్న దేశ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం శరాఘాతంగా మారనుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలో 1997లో ఏర్పాటైన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పి.పి.ఎ) సాంకేతికంగా ఔషధాల ధరలను నియంత్రిస్తుంది. 'దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల రీత్యా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనివార్య పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు' ధరల పెంపునకు అనుమతిస్తూ ఆ సంస్థ చేసిన ప్రకటన హాస్యాస్పదం! ఉత్పత్తి వ్యయం పెరగడం, ధరల నియంత్రణ చర్యల కారణంగా ఔషధాలను ఉత్పత్తి చేయడం అసాధ్యంగా మారిందంటూ తయారీదారులు భీష్మించుకు కూర్చోవడమే ఎన్.పి.పి.ఎ చెప్పిన 'అసాధారణ పరిస్థితి'! ఔషధాలను అందుబాటులో ఉంచడానికి ధరలను పెంచడానికి అనుమతివ్వడమే 'ప్రజా ప్రయోజనం'. ఇంతకన్నా అడ్డగోలు వాదన మరోటి ఉంటుందా? 1997లో ఎన్.పి.పి.ఎ ఏర్పాటైన తరువాత నుండి ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ధరలను సమీక్షించి పెంపునకూ అనుమతిస్తూనే ఉంది. దీనికోసం ఔషధాలను ప్రభుత్వం షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ తరగతులుగా విభజించింది. ముఖ్యమైన ఔషధాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చారు. టోకు ధరల సూచిక ఆధారంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం వీటి ఎగువ సీలింగ్ ధరను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఈ జాబితాలో 384 ఔషధాలు, నాలుగు వైద్య పరికరాలు ఉన్నాయి. నాన్ షెడ్యూల్డ్ ఔషధాల ధరలను తయారీదారులే కొన్ని నిబంధనలకు లోబడి నిర్ణయించుకోవచ్చు. షెడ్యూల్డ్ ఔషధాల ధరలను నిర్దేశించిన ప్రమాణాల కన్నా ఎక్కువగా పెంచాలని తయారీదారులు అడిగిందే తడవుగా కేంద్రం తలూపింది. ఎన్.పి.పి.ఎ కున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి మరీ ఔషధ తయారీ కంపెనీలకు మేలు చేసింది. ఇలా ఉత్పత్తిదారుల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం తలొగ్గడం ఇదే మొదటిసారి కాదు. 2019లోనూ, 2021లోనూ ఆర్థిక సంవత్సరాల మధ్యలో ఈ తరహా నిర్ణయాలనే తీసుకుంది. గత నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ హెల్త్ అకౌంట్స్ నివేదిక ప్రకారం ఆరోగ్యంపై పెడుతున్న ఖర్చులో మూడో వంతు మందులకు అవుతోందని ఆ నివేదిక పేర్కొంది. ఇన్సూర్ టెక్ ఫ్లమ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో మన దేశంలో వైద్య ద్రవ్యోల్బణం 14 శాతానికి చేరింది. సరైన చర్యలు తీసుకోకపోతే ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని ఆ సంస్థ హెచ్చరించింది. ఆన్‌లైన్ బీమా సంస్థ 'పాలసీ బజార్' గణాంకాల ప్రకారం 2019లో 17,900 రూపాయలుగా ఉన్న వార్షిక ఆరోగ్య బీమా పాలసీ ధర ఈ ఏడాది 26,533 రూపాయలకు చేరింది.

దీనికి ప్రధాన కారణం ఔషధాల ధరల్లో భారీ పెరుగుదల చోటు చేసుకోవడమేనని ఆ సంస్థ తెలిపింది. పెరుగుతున్న ఔషధాల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్న తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డి.పి.సి.ఓ) 1979 ప్రకారం ముఖ్యమైన ఔషధాల ధరలను ప్రభుత్వం నియంత్రించేది. నాణ్యమైన, తక్కువ ధరలకు అవసరమైన మందులను ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగం బలంగా ఉండేది. ఆ పరిస్థితి ప్రస్తుతం మారింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చారు. రోగులు వినియోగదారులుగా మారారు. ప్రైవేటు రంగాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం వారి చేతిలో కీలుబొమ్మగా మారింది. ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ పేరుతో అన్ని నియంత్రణలను ఎత్తివేసింది. కార్పొరేట్, బహుళజాతి ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యానికి ఔషధ రంగాన్ని వదిలివేసింది. ఫలితం ఏడాదికేడాదికి పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్టుగా సామాన్యుల స్థితి తయారవుతోంది. పేదల మూలుగులు పీల్చి కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఆ విధానాలను ప్రతిఘటించడమే ఈ సమస్యకు పరిష్కారం.

# కొత్త పరిశ్రమలు రావలసిందే ఉద్యోగాలు కావాల్సిందే .. కానీ!



రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగు కావచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చే నినాదాలు బెరుకు కలిగిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి) కాదు, ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పి.పి.పి.పి) అన్నారు. మూడు 'పి'లు పోయి నాలుగు 'పి' లు వచ్చాయి. 'ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్' (వ్యాపారం తేలికగా చేసుకోవటం) ఎపుడో వచ్చింది. దీనికి అదనంగా రాష్ట్రంలో ఇపుడు 'స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్' వచ్చింది. అనుభవాలను మరిచిపోలేరు. కష్టాలు పడ్డ వారి కథలు కో కొల్లలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అన్నారు. ప్రభుత్వ (ప్రజల) ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయి? ఒక పక్కన దసరా, సంక్రాంతి పండుగల సందర్భాల్లో 4 లైన్లు, 6 లైన్లు హైవేల్లో టోలుగేట్లు దగ్గర బారులు తీరే కార్లు. మరోపక్క రైళ్లలో జనరల్ కంపార్ట్‌మెంట్లు, స్లీపర్‌కోచ్‌లు తగ్గిపోయి, బస్టాండ్లలో తగినన్ని బస్సులు లేక కిటకిటలాడిపోయే జనం. ప్రైవేట్ కంపెనీల చేతివాటంతో పెరిగిపోతున్న 'ట్రూ అప్' విద్యుత్తు భారాలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అసలు రూపం ఇదే. ఇపుడు కొత్తగా ప్రజల భాగస్వామ్యాన్ని కూడా చేర్చారు. ఇంతకు ముందు లేనిది ఇపుడు కొత్తగా వస్తోందా? మునుపటి కంటే ప్రజల భాగస్వామ్యం మరింత పెరిగిపోతుందా? కొత్తగా ప్రజలకు అనుకూల మార్పు వస్తోందా? ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా-చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. ఇపుడు కొత్తగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ వారిని 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ కార్మికులుగా కూడా గుర్తించలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి. కొత్తగా వచ్చే నాలుగో 'పి' అంటే ప్రజల భాగస్వామ్యం ఏ విధంగా అదే ప్రజలకు ఇంత కంటే మెరుగ్గా ఒరగబెడుతుందో కూటమి ప్రభుత్వం చెప్పాలి. లేదంటే ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందోనని ప్రజలు తెలుసుకోటానికి పెద్ద సమయం పట్టదు. ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ (తేలికగా వ్యాపారం చేసుకోవటం) పేరుతో పెట్టుబడిదారులకు ఉన్న ఆటంకాలను తొలగించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. కనీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. 2005-06 సంవత్సరాల తర్వాత పరిశ్రమలతో సహా షెడ్యూల్డు ఎంప్లారుమెంట్లలో 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచలేదు. ఆ 18 సంవత్సరాల క్రితపు వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. లేబరు అధికారులు చేతులెత్తేశారు. తమ చేతులు కట్టివేయబడ్డాయని వాపోతున్నారు. ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ పరిస్థితే ఇలా ఉంటే 'స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్' ఇంకెలా ఉంటుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తాము మరింతగా తొక్కివేయబడతామని భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఏ ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదని కార్మికులు గుర్తించాలి. ఒకరు ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రతి ఫ్యాక్టరీలో యూనియన్లు పెట్టమని చెపుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్లు పెట్టి ఆందోళన చేస్తామంటే కుదరదంటారు. మరొకరు ప్రతిపక్షంలో ఉండగా వీధి వీధికి, గడప గడపకు తిరిగి అధికారంలోకి వచ్చాక కలుగులో ఉండిపోయి బయటకు రాలేదు. కార్మికుల సమస్యలను, కోర్కెలను తెలియజేయటానికి యూనియన్లు పెట్టటం తప్పనిసరి. 1926 ట్రేడ్‌యూనియన్ల చట్టం ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల (లేబర్ కమిషనర్లు) ద్వారా కార్మిక సంఘాలను రిజిస్టర్ చేయటం ప్రభుత్వాల బాధ్యత. తద్వారా విడి విడి కార్మికుల గొంతును వినిపించే అవకాశం కల్పించాలి. రాజ్యాంగంలోని 19(1) (సి) అధికరణం ప్రకారం యూనియన్లు, అసోసియేషన్లను ఏర్పాటు చేసుకోవటం ప్రాథమిక హక్కు. పారిశ్రామిక వివాదాల చట్టం సమ్మె చేయటాన్ని కార్మికుల చట్టపరమైన హక్కుగా గుర్తించింది. ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ కింద ఈ హక్కులు కాలరాయబడుతున్నాయి. కార్మికులు సంఘటితం కావాలి. చట్టపర హక్కుల కోసం పోరాడాలి. కార్మిక సంఘాలు కార్మికులను చైతన్యపర్చి కార్మికులను సంఘటితం చేసేందుకు పూనుకోవాలి.